

పరీక్షలంటే భయం వద్దు



మార్కులు, ర్యాంకులు ముఖ్యం కాదు
ప్రశాంతంగా పరీక్షలు రాయండి
విద్యార్థులకు కలెక్టర్ వీడియో సందేశం

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'పరీక్షలంటే మార్కులు, ర్యాంకులు, ఉద్యోగంకాదు.. విద్య ఇంగిత జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది..' అని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. విద్యార్థులకు హితబోధ చేస్తూ.. వారిలో పరీక్షలంటే భయంపోగొట్టి ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి ప్రత్యేకంగా ఓ వీడియోను కలెక్టర్ గురువారం విడుదల చేశారు. 'విద్య ఒక పరమార్థం. అన్నింటిలోను చక్కగా ఉపయోగించుకోవడం అలవర్చుకోవాలి. చాలా మంది పిల్లలు పరీక్షల సమయంలో టెన్షన్‌తో నిద్రాహారాలు మాని చదువుతుంటారు. ఇలా పరీక్షా సమయం వచ్చేసరికి శారీరకంగా, మానసికంగా కృంగిపోతారు. దీనివల్ల పరీక్షలు సరిగా రాయలేకపోతారు. ఇప్పటి నుంచే ప్రశాంతంగా చదివితే పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడి ఉండదు. శ్రమకు తగ్గ ఫలితం తప్పకుండా వస్తుంది. ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షా కేంద్రంలోకి వెళ్లండి. ప్రశ్నపత్రాన్ని తొలుత బాగాచదవండి. అందులో ఎన్ని వచ్చో, ఎన్ని రావో చూసుకోండి. వచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయడం మొదలుపెట్టండి. హ్యాండ్ రైటింగ్ బాగా ఉండేలా చూసుకోండి. అన్ని ప్రశ్నలు రాయండి. అద్భుతమైన కలలుకనండి. ఉత్తమ ఫలితాలు పొందండి. ఆల్ ది బెస్ట్' అంటూ కలెక్టర్ సందేశం ఇచ్చారు.

7లోపు కొత్త ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలి

హౌసింగ్ ఎండీ రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న హౌసింగ్ పీడీ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సొంత స్థలం ఉండి... కొత్త ఇంటి కోసం మార్చి 7వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఎండీ రాజాబాబు తెలిపారు. గురువారం అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హౌసింగ్ ఎండీ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థలం ఉన్న వారు పీఎంఏవై ఎన్టీఆర్ ఇళ్ల కోసం మార్చి 7వతేదీలోపు ఆయా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. బీసీలకు అదనంగా రూ.50వేలు, ఎస్సీ ఎస్టీలకు రూ.75వేలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. హౌసింగ్ పీడీ శైలజ తన చాంబర్ నుంచి పాల్గొని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కార్యక్రమంలో హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

గోప్యత ఎందుకో..?



లెక్చరర్స్ కాలనీ సమీపంలో వేసిన కొట్టాలు

భూకబ్జాలపై పోలీసుల చర్యలు

- నాలుగు రోజుల్లో 23 మందిపై కేసు
- పేర్లు వెల్లడించని వైనం
- సర్వత్రా విమర్శలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అవేమీ ప్రభుత్వ భూములు కాదు. కష్టపడిన ప్రతి రూపాయి పోగు చేసి, ఆదా చేసి మరీ కొనుగోలు చేసిన భూములు. కొందరికి తాతల నుంచి సంక్రమించిన ఆస్తులు. ఇలాంటి ప్రైవేటు భూములను కొందరు ప్రజాసంఘాల పేరుతో ఆక్రమించి, గుడిసెలు వేసుకున్నారు. ఈ విషయంపై బాధితులు నెలరోజుల క్రితం తహసీల్దార్, ఆర్డీఓ, త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివాదమైన తరువాత కానీ రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించలేదు. ఇప్పటికీ ఆ ప్రైవేటు భూమల కబ్జాకు ప్రయత్నించిన వ్యక్తుల వెనకున్న శక్తులెవరో సామాన్యులకు తెలియడం లేదు. రోజుకో భూమికి సంబంధించి ఐదుగురు, ఆరుగురిపై కేసులు నమోదవుతున్నా.. వారి పేర్లు వెల్లడించేందుకు పోలీసులు వెనకడుగు వేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఎఫ్ఐఆర్‌లోనైనా వారి పేర్లున్నాయా, అందులో కూడా ఒకరు, ఇద్దరు, ముగ్గురు అంటూ ఉన్నాయా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. త్రీటౌన్ సీఐ శాంతిలాల్ వారి విషయంలో ఎందుకంత గోప్యత ప్రదర్శిస్తున్నారో అర్థం కావడం లేదు. ఓ మూడు సామాజికవర్గాలకు చెందిన వ్యక్తులున్నట్లు తెలుస్తోంది. వీటి వెనుక రాజకీయ ప్రమేయం ఉందా...? సంఘాల ముసుగులో సొమ్ము చేసుకోవాలనుకుంటున్నారా? అనేది తెలియాల్సి ఉంది.

అంతర్యం ఏమిటో..?

ప్రైవేటు భూములు స్వాహా చేస్తున్న వారెవరో తెలియకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. దాదాపు 200 నుంచి 250 మంది వరకు ప్రజాసంఘాల పేరుతో ఆ భూముల్లో కొట్టాలు వేసినట్లు తెలుస్తోంది. అందరూ ఒకే సమయంలో ఆ భూముల కబ్జాకు ప్రయత్నించినట్లు సమాచారం. అలాంటి వ్యక్తుల పేర్లు చెప్పకుండా పోలీసులు గోప్యత పాటిస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా వారి పేర్లను వెల్లడించాలనే డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.



కాన్షీరాం కాలనీ పేరిట..

నాలుగు రోజుల్లో 23 మందిపై కేసు

భూకబ్జాల పరంపర నేపథ్యంలో గత నెలలో బాధితులు.. రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజుల పాటు స్తబ్దుగా ఉన్నారు. ఎట్టకేలకు ఎస్పీ జగదీష్ చొరవతో కబ్జాదారులపై చర్యలకు ఉపక్రమించారు. తొలుత సుబ్బారెడ్డి, విజయ్‌కుమార్, ఈశ్వర్‌ప్రసాద్, సునీత ఫిర్యాదు చేశారని 95/2ఏ, 91/5, 91-6, 92-2, 89-4లలో దాదాపు 3.90 ఎకరాలు కబ్జా చేశారని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇక త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో 23 మందిపై కేసు నమోదు చేశారు. ఈనెల 15వ తేదీ హెచ్చెల్సీ కాలనీలో బుక్కరాయసముద్రం టీచర్స్ కాలనీకి చెందిన కసిరెడ్డి సూర్యనారాయణ రెడ్డికి సంబంధించి సర్వే నంబరు 95/1బీలో 43 సెంట్ల భూమిని ఆక్రమించారనే ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు కట్టారు. 16వ తేదీ తాడిపత్రికి చెందిన సుబ్బారెడ్డి... మరికొందరితో కలిసి కొనుగోలు చేసిన సర్వే నంబరు 95/2ఏలోని 66 సెంట్లు ఆక్రమించారనే ఫిర్యాదుపై 8 మందిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పిత్రార్జిత ఆస్తిలో సర్వే నంబరు 89/9లో 3సెంట్లు, 90/5లో 12సెంట్లు, 91/5లో 55సెంట్లు, 91/6లో 12సెంట్లు, 92/2లో 30సెంట్లు మొత్తం 114 సెంట్లు ఆక్రమించారని త్రీటౌన్ పోలీసులకు విజయకృష్ణ ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు 17వ తేదీన ఐదుగురిపై కేసు నమోదు చేశారు. కమలానగర్‌లో నివాసముంటున్న డాక్టర్ వీరభద్రయ్య, డాక్టర్ బాలాకుమారి తమకు చెందిన సర్వేనంబరు 94లోని 12సెంట్లు, 89/4బీలో 38 సెంట్ల భూమిని కొందరు ఆక్రమించారని ఫిర్యాదు చేశారు. ఆ మేరకు 18వ తేదీన ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

పది లీటర్లకు లీటరు..!

పెట్రోల్ బంకులో ఘరానా మోసం



పంప్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సోములదొడ్డి సమీపంలోని శ్రీవిజయలక్ష్మి ఆటోకేర్ పెట్రోల్ బంక్‌లో ఘరానా మోసం బయట పడింది. లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్ అధికారులు గురువారం సంయుక్తంగా తనిఖీలు చేశారు. పంప్ నుంచి పది లీటర్ల డీజిల్ పట్టిస్తే 9 లీటర్లు మాత్రమే రావడంతో అధికారులు అవాక్కయ్యారు. లీగల్ మెట్రాలజీ అధికారులు ఏర్పాటు చేసిన సీల్‌ను ఏమాత్రం కదిలించకుండా తక్కువ కొలత వచ్చేలా చిప్ ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. రికార్డుల ప్రకారం ప్రతి రోజు 1500 లీటర్ల వరకు డీజిల్‌ను విక్రయించారు. ఈ లెక్కన రోజుకు 150 లీటర్ల వరకు డీజిల్‌ను కాజేశారు. ఏడాదికి 54,750 లీటర్ల డీజిల్‌ను వినియోగదారుల నుంచి దోచుకున్నారు. సొమ్ము రూపంలో దీని విలువ రూ.54.75 లక్షలు. ఎన్నేళ్లుగా ఈ మోసానికి పాల్పడుతున్నారో తేలాల్సి ఉంది. ఈ లెక్కన రూ.కోట్లలో స్కామ్ చేసినట్లు అర్థమౌతోంది. తనిఖీల అనంతరం అధికారులు చిప్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని అధికారులు తెలిపారు. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, అక్రమార్కుల ఆట కట్టిస్తామని విజిలెన్స్ ఎ స్పీ వైబీపీటీఏ ప్రసాద్, డీఎస్పీ నాగభూషణం తెలిపారు. తనిఖీలలో సీఐ జమాల్‌బాషా, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్, ఇన్‌స్పెక్టర్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే తెగనమ్ముకుంటున్నారు!

మార్కెట్‌లో విత్తన జొన్న క్వింటా రూ.4,500..

- దళారులు కొంటున్నది రూ.2,800కే..
- గత్యంతరం లేక నష్టానికే విక్రయం
- కోట్లలో నష్టపోతున్న రైతులు



విత్తన జొన్న రైతుకు విపత్కర పరిస్థితి వచ్చింది. ఆరుగాలం శ్రమించి, లక్షలు పెట్టుబడులు పెట్టి పంట పండించాడు కానీ, అమ్ముకోలేక పోతున్నాడు. పంటను అమ్ముకుందామంటే మార్కెట్ లేదు. మార్కెట్‌లో ధర బాగున్నా.. దళారులు మాత్రం అతి తక్కువకే అడుగుతున్నారు. ఎక్కడ అమ్ముకోవాలో తెలీక.. నష్టమైనా తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకే అప్పజెబుతున్నారు అన్నదాతలు. మండల రైతులు కోట్ల రూపాయలు నష్టపోతున్నారు.



జొన్న బస్తాలను లోడ్ చేస్తున్న కూలీలు

విడపనకల్లు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని హవళిగి, కరకముక్కల, పాల్తూరు, చీకలగురికి, ఉండబండ తదితర గ్రామాల్లో రైతులు విత్తన జొన్న పంటను వేల ఎకరాల్లో సాగు చేశారు. వీరు చేసిన తప్పిదం ఆయా కంపెనీల వారితో అగ్రిమెంటు చేసుకోకపోవడమే. వీరు సాగు చేసిన విత్తన జొన్నకు గిట్టుబాటు ధర లేకపోయింది. హవళిగి గ్రామంలోనే దాదాపు 40 వేల టన్నుల విత్తన జొన్న స్టాక్ నిలిచిపోయింది. దళారులు సిండికేట్‌గా ఏర్పడి, పంటను కొనుగోలు చేయకుండా రెండు నెలలు నిలిపివేశారు. దీంతో పురుగు పట్టి పంట పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఇంకో రెండు వారాలు స్టాక్ ఆరుబయట ఎండకు, గాలికి ఉంటే పురుగు పట్టి కనీసం కిలో రూ.10కి కూడా విక్రయించుకోలేమని భావించి, దళారులు అడిగిన ధరకే విక్రయించేస్తున్నారు. మార్కెట్ ధర క్వింటాకి రూ.4500 ఉంటే.. దళారులు రూ.2800 నుంచి రూ.2900కి కొనుగోలు చేస్తున్నారు. చేసేదిలేక రైతులు అదే ధరకు అమ్ముకుంటున్నారు. వివిధ ప్రాంతాల దళారులు హవళిగి గ్రామం చేరుకుని విత్తన జొన్నను కొని, తరలిస్తున్నారు.


ఇంత తక్కువ ఎన్నడూ లేదు..

ఏటా ఎంతో కొంత గిట్టుబాటు ధరకు విత్తన జొన్నను విక్రయించుకునేవారమని రైతులు చెబుతున్నారు. ఇంత తక్కువ ధరకు ఎప్పుడూ అమ్ముకోలేదని వాపోతున్నారు. దళారులు ఏకమై రైతులను నిలువునా ముంచేశారనీ, వేల క్వింటాళ్ల విత్తన జొన్నను దోచుకెళ్తున్నారని ఆవేదన చెందుతున్నారు. పురుగు పట్టి విత్తనం పూర్తిగా కుళ్లిపోతే పశువులు తినేందుకు కూడా పనికిరాదనీ, అందుకే దళారులు అడిగిన ధరలకు సీడ్ జొన్నను విక్రయిస్తున్నట్లు వారు చెబుతున్నారు.




తరలించేందుకు సిద్ధంగా ఉన్న జొన్న బస్తాలు

దళారులను అరికట్టాలి



విత్తన జొన్న సాగు చేసిన రైతులను మోసం చేసిన దళారులపై చర్యలు తీసుకోవాలి. రైతులు పండించిన విత్తన జొన్నకు గిట్టుబాటు ధర కల్పించి, ఆదుకోవాలి. దళారులను అరికట్టకపోతే రైతులు రూ.లక్షల్లో నష్టపోతారు.

- చెన్నరాయుడు, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు



దళారుల సిండికేట్: ఓబులేసు, రైతు, హావళిగి

విత్తన జొన్న స్టాక్ అధికంగా ఉండటంతో దళారులు సిండికేట్‌గా ఏర్పడి, రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. బయట మార్కెట్‌లో క్వింటా రూ.4500 ధర ఉండగా.. ప్రస్తుతం రూ.2800కే అమ్ముకుంటున్నాం. రెండు నెలలు ఎండకు ఎండుతూ ఉండటంతో జొన్న విత్తనం కుళ్లిపోయే పరిస్థితికి వచ్చింది. పురుగు పట్టిందంటే ఎందుకూ పనికి రాదు. కనీసం క్వింటా వెయ్యికి కొనేవారుండరు. దీంతో తక్కువ ధరకే విక్రయించేస్తున్నాం. దరలులేక రూ.15లక్షల వరకూ నష్టపోయా.

అటకెక్కిన ఉద్యోగోన్నతులు

- ఆరు నెలలుగా గ్రేడ్-3 ఏఎన్ఎంల నిరీక్షణ
- వైద్యశాఖలో విలీనం.. ప్రమోషన్లు పెండింగ్
- ప్రభుత్వం ఆదేశించినా.. సాకులతో జాప్యం



అనంతపురం టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కరుణించి ఉత్తర్వులు జారీ చేసినా.. అధికారులు అటకెక్కించారు. ఉద్యోగోన్నతుల కోసం గ్రేడ్-3 ఏఎన్ఎంలు ఆరు నెలలుగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు అందిన తరువాత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఉద్యోగోన్నతులకు సీనియారిటీ జాబితాను తయారు చేశారు. కానీ ఏవేవో కారణాలు చూపుతూ పట్టించుకోవడం మానేశారు. ఉద్యోగోన్నతలు పేరుతో కొందరు వ్యాపారానికి తెరలేపారని ప్రచారం జరుగుతోంది. అందుకే ఏఎన్ఎంల ఉద్యోగోన్నతుల ఫైల్ ముందుకు సాగడం లేదని అంటున్నారు.

ఎందుకో.. అటకెక్కించారు..

గ్రామ సచివాలయాలకు గత ప్రభుత్వం ఏఎన్ఎంలను నియమించింది. వీరు వైద్యశాఖ ఆధ్వర్యంలో పనిచూస్తూ, వేతనాలను మాత్రం మండల పరిషత్(ఎంపీడీఓ) ద్వారా పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోని గ్రేడ్-3 ఏఎన్ఎంలను వైద్యశాఖలోకి పూర్తిగా విలీనం చేయాలని నిర్ణయించింది. దీంతోపాటు వారికి ఎంపీహెచ్ఏ (ఫిమేల్) ఉద్యోగోన్నతులు కల్పించాలని ఆదేశాలు ఇచ్చింది. గత ఏడాది అక్టోబరులో ఈ దిశగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,017 మంది పనిచేస్తున్నారని అధికారులు తేల్చారు. వీరికి సీనియారిటీ ప్రకారం ఎంపీహెచ్ఏగా(ఫిమేల్) ఉద్యోగోన్నతులు కల్పించేందుకు జాబితాను తయారు చేశారు. ఆ తర్వాత ఏం జరిగిందోగానీ.. ప్రక్రియను ఆపేశారు.

ఎదురుచూపులు

ఉద్యోగోన్నతులతోపాటు వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోకి వస్తామని, ఇదే శాఖలో వేతనాలు తీసుకోవచ్చని గ్రేడ్-3 ఏఎన్ఎంలు ఆశించారు. మంచి భవిష్యత్తు ఉంటుందని భావించారు. అధికారిక లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 200 మందికి ఉద్యోగోన్నతులు దక్కే అవకాశం ఉంది. కానీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయడం లేదు. ఉద్యోగోన్నతుల పేరిట ఆ శాఖలో పనిచేస్తున్న కొందరు డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వారి స్వార్థం కోసం నెలల తరబడి ఏఎన్ఎంలు ఎదురుచూడాల్సి వస్తోంది. ఇటీవల కడప జిల్లాలో ఉద్యోగోన్నతులు కల్పించి.. పోస్టింగ్‌లు ఇచ్చారు. ఉమ్మడి జిల్లా ఉద్యోగోన్నతులు జాప్యమైతే.. భవిష్యత్తులో జోనల్ ఉద్యోగోన్నతులకు సీనియారిటీ విషయంలో తమకు అన్యాయం జరుగుతుందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ కూడా వెంటనే ఉద్యోగోన్నతులు ఇవ్వాలని గ్రేడ్-3 ఏఎన్ఎంలు వేడుకుంటున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాల్సిన అవసరం ఉంది.

నాలుగు రోజుల్లో జాబితా..



ఏఎన్ఎంల ఉద్యోగోన్నతులు ఆలస్యమైన విషయం వాస్తవమే. దీనిపై క్లారిటీలేక రాష్ట్రంలో అన్ని జిల్లాలోను నిలిపేశారు. ఇటీవల కడప జిల్లాలో ఉద్యోగోన్నతులు ఇచ్చారు. ఉద్యోగోన్నతులు వచ్చినవారిని సబ్ సెంటర్లలో నియమిస్తున్నాం. దీనికోసం ఉమ్మడి జిల్లాలో ఖాళీల వివరాలను తీసుకుంటున్నాం. నాలుగు రోజుల్లో సీనియారిటీ జాబితాను విడుదల చేస్తాం. ఆ తర్వాత అభ్యంతరాలు స్వీకరించి, వెంటనే ఉద్యోగోన్నతులు కల్పిస్తాం. ఈ విషయంలో ఇంతకన్నా మరొకటి లేదు. డబ్బులు తీసుకోవడం అనేది అవాస్తవం.

- డాక్టరు ఈబీ దేవి, డీఎంహెచ్ఓ

మనదే కదా అని..!

- ఆర్టీసీలో రూ.1.96 లక్షలు వాడిన ఉద్యోగి
- అలస్యంగా గుర్తించి.. గుట్టుగా రికవరీ చేసిన అధికారులు



19వ తేదీన రూ.1.40 లక్షలు కడుతున్నట్లు గుత్తి డీఎంకు వరప్రసాద్ బాబు రాసిన లేఖ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ అనంతపురం రీజియన్ పరిధిలో ఓ ఉద్యోగి ఏకంగా రూ.1.96 లక్షలు గోల్‌మాల్‌కు పాల్పడ్డాడు. గుత్తి డిపోలో ఎస్టీఐగా పనిచేస్తున్న వరప్రసాద్ బాబు బస్సుల టోల్‌గేట్ ఫీజుల కోసం చెల్లించాల్సిన సొమ్ములో కొంచెంకొంచెంగా జేబులో వేసుకుంటూ రాసాగాడు. ఈ తతంగం 2024 ఆగస్టు నుంచి సాగుతున్నా ఉన్నతాధికారులు గుర్తించలేకపోయారంటే వారి అలసత్వం ఏపాటిదో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆర్టీసీ బస్సులకు టోల్‌గేట్ ఫీజులకోసం చెల్లించేందుకు జిల్లా కార్యాలయం నుంచి ఆయా డిపోల పరిధిలోని ఎస్టీఐల ఖాతాల్లోకి 10రోజులకోసారి డబ్బు జమ చేస్తారు. ఈ క్రమంలోనే గుత్తి డిపో ఎస్టీఐ వరప్రసాద్ బాబు ఖాతాలోకి డబ్బు జమ చేస్తూ వచ్చారు. 10 రోజులకు సరిపోయేలా వచ్చే డబ్బులో వరప్రసాద్ బాబు 8 రోజులకు మాత్రమే టోల్‌గేట్‌ల ఫీజు చెల్లించి, జిల్లా కార్యాలయానికి మాత్రం 10 రోజులకు సరిపడా చెల్లించినట్లు సమాచారం ఇచ్చేవాడు. మిగిలిన రెండురోజుల సొమ్మును మాత్రం టెక్నికల్ ఇష్యూ చూపుతూ లెక్క చూపకుండా తన జేబులో వేసుకునేవాడు. ఇలా ఆగస్టు నుంచి ఇప్పటి వరకు ఏకంగా రూ.1.96 లక్షలు మాయం చేసేశాడు.

గుట్టుగా రికవరీ

బస్సుల టోల్‌గేట్ ఫీజు సొమ్ము గోల్‌మాల్ విషయాన్ని ఆర్టీసీ జిల్లా అధికారులు ఆలస్యంగా గుర్తించారు. ఆగస్టు నుంచి ఈ తతంగం సాగుతున్నా ఇప్పటివరకూ ఎవరూ గుర్తించలేదు. బుధవారం విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో భాగంగా రికార్డుల్లో వరప్రసాద్ బాబుకు సంబంధించి టోల్‌గేట్ ఫీజుల లెక్కకు సంబంధించి రిసిప్ట్‌లు చూపలేదు. దీంతో హుటాహుటిన ఆర్ఎంకు సమాచారం చేరవేశారు. ఆయన విజయవాడకు వెళ్లడంతో వెంటనే గుత్తి డిపో ఇన్‌చార్జిగా ఉన్న గుంతకల్లు డిపో మేనేజర్ గంగాధర్‌కు తెలిపారు. డీఎం గంగాధర్ గుత్తికి చేరుకుని వరప్రసాద్‌ను విచారించగా నిజమేనని తెలిసింది. దీంతో వరప్రసాద్‌బాబును డిపోలోనే ఉంచి, ఆ డబ్బు చెల్లిస్తావా..! పోలీసు కేసు నమోదు చేయించాలా..? అంటూ గట్టిగా అడగడంతో బుధవారం సాయంత్రానికల్లా తనకు తెలిసినవారి నుంచి డబ్బు తెప్పించుకుని రూ.1.40లక్షలు డీఎంకు చెల్లించాడు. మిగిలిన సొమ్ము గురువారం చెల్లిస్తాననడంతో గడువు ఇచ్చారు. మొత్తానికి గురువారం మధ్యాహ్నానికి మిగిలిన రూ.56,290 చెల్లించేశాడు. ఈ విచారణ, రికవరీ అన్నీ అధికారులు గుట్టుగా సాగించేశారు. ఆర్టీసీలో టిక్కెట్లు, బస్సుల స్పేర్ పార్ట్స్ విషయంలో డ్రైవర్లు, కండక్టర్ల వల్ల ఏ చిన్న పొరపాటు జరిగినా ఒకటికి పదింతలు తిరిగి కట్టించుకుంటారు. రూ.100 పోయినా రూ.వెయ్యి కట్టే వరకూ వదలరు. అలాంటిది ఎస్టీఐ స్థాయి అధికారి ఏకంగా రూ.1.96 లక్షలు కాజేస్తే ఉన్నతాధికారులు రికవరీ విషయంలో పక్షపాతం ప్రదర్శించి గుట్టుగా రికవరీ చేసుకున్నారన్న అభిప్రాయాలు ఆ శాఖ వర్గాల నుంచే వ్యక్తమవుతుండడం గమనార్హం.

చూడాలంటే భయపడాలి..!

బాలికల జోలికొస్తే ఎన్‌కౌంటర్ చేయండి

పోలీసులకు ఎమ్మెల్యే పరిటాల సునీత వినతి

'ఆద్య' పేరిట పోలీసు శాఖ వినూత్న కార్యక్రమం

తొలిసారిగా నసనకోట ఎంజేపీ పాఠశాలలో నిర్వహణ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎస్పీ రత్న, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న తదితరులు



నారీ శక్తిని తెలిపే నృత్య ప్రదర్శన



రామగిరి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బాలికల వైపు కన్నెత్తి చూడాలంటే కీచకులు భయపడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. సమాజంలో జరిగే పరిణామాలను తెలియజేసి.. బాలికలను చైతన్యపరిచేందుకు శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు 'ఆద్య' పేరిట తొలిసారి నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. నసనకోటలోని ఎంజేపీ బాలికల పాఠశాలలో ఎస్ఐ సుధాకర్ యాదవ్ అధ్యక్షతన గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలను వేధించేవారిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేయాలని ఎమ్మెల్యే అన్నారు. చిన్న వయసులో ప్రేమ, ఇతర వాటికి ఆకర్షితులు కావద్దని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అనుక్షణం పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విద్యాభివృద్ధి కోసం తాను, తన భర్త పరిటాల రవీంద్ర ఎంతో కృషిచేశామని అన్నారు. బాలికల విద్యాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు. 'ఆద్య అంటే పవర్, సాటిలేని వ్యక్తి' అని అన్నారు. మహిళలు, బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలని అన్నారు. భర్తను కోల్పోయి, కష్టకాలంలో రాజకీయాల్లోకి వచ్చానని, శవాలను దాటుకుని నామినేషన్ వేసిన రోజులు ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. ఆ తరువాత రాజకీయాల్లో రాణిస్తున్నానని అన్నారు. తనలాగే ప్రతి మహిళ ధైర్యంగా అడుగులు వేయాలని అన్నారు. తల్లిదండ్రుల సహకారంతో రాణించిన అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఎస్పీ రత్నను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఎంతో మంది రైతులు పంటలు సరిగా పండకపోయినా, తిన్నాతినకపోయినా బిడ్డల చదువుకోసం డబ్బులు ఖర్చు చేస్తున్నారని, వారి ఆశలను వమ్ము చేయవద్దని సూచించారు.

అరచేతిలో అద్భుతం: ఎస్పీ రత్న



సెల్‌ఫోన్ అరచేతిలో అద్భుతమని.. అది శాపంగా మారకుండా చూసుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. టెక్నాలజీని మంచి కోసం ఉపయోగించాలని అన్నారు. బాలికల రక్షణ కోసం పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని, సైబర్ క్రైం, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైన తప్పుదోవ పట్టించాలని చూస్తే ధైర్యంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఫిర్యాదు చేయాల్సిన నంబర్లను బాలికల చేత చెప్పించారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే వారికి లోకంలో ఏది చూసినా అందంగా కనిపిస్తుందని, ఆ సమయంలోనే ఏది మంచి ఏది చెడు అన్నది తెలుసుకోవాలని హితవు పలికారు. 'మీ జీవితాన్ని.. మీ శరీరాన్ని పరాయి వ్యక్తుల పాలు చేయవద్దు. సోషియల్ మీడియాలోకి ప్రవేశించి మీ జీవితాన్ని పక్కదారి పట్టించుకోవద్దు' అని సూచించారు.

నమ్మకాన్ని వమ్ము చేయొద్దు - అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న



తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో అమ్మాయిలను చదివిస్తుంటారని, వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా బాగా చదువుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న సూచించారు. ఒక్కరు తప్పు చేసినా ఆ ప్రభావం మొత్తం పాఠశాల, గ్రామం మీద పడుతుందని హెచ్చరించారు. 'మా ఇంట్లో ఇద్దరు ఆడపిల్లలం ఉన్నాం. త్వరగా పెళ్లి చేయాలని మా తల్లిదండ్రులపై ఒత్తిడి ఉండేది. కానీ వారు నాపై నమ్మకంతో సివిల్స్ కోసం ఢిల్లీకి పంపించారు. నేను నాలుగుసార్లు వరుసగా విఫలమయ్యాను. నాపై నాకు నమ్మకంలేని సమయంలో నా తల్లిదండ్రులు వెన్నుతట్టి ప్రోత్సహించారు. చివరికి ఐదవ సారి సివిల్స్‌లో ర్యాంకు సాధించాను. ఐపీఎస్‌గా మీ ముందుకు వచ్చాను' అని వివరించారు. పాఠశాల బాత్‌రూంలోలలో బాలికలు ప్రసవిస్తున్నారు. ఈ సంఘటనలు నన్ను కలచి వేస్తున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆడబిడ్డలకు రక్షణ: శైలజ, న్యాయవాది

ఇటీవల బాలికలు, మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు ఎక్కువయ్యాయని ప్రముఖ న్యాయవాది పరిటాల శైలజ అన్నారు. వీటి నియంత్రణకు ఓ వైపు పోలీసుశాఖ పని చేస్తోందని, అదే సమయంలో న్యాయపరంగా తాము అందుబాటులో ఉంటామని అన్నారు. పాఠశాలస్థాయి నుంచి అనేక అంశాలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆద్యలాంటి కార్యక్రమాలు బాలికల భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడతాయని అభినందించారు. ఆద్య కార్యక్రమంలో బాలికల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఫైరోజ్ బేగం, ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, టీడీపీ నాయకులు ఎల్.నారాయణచౌదరి, రామ్మూర్తినాయుడు సర్పంచ్ లలితమ, ఎంపీటీసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రుద్రాభిషేకం చేస్తున్న పండితులు

ఓం నమఃశివాయ

ఏడోరోజూ కొనసాగిన యజ్ఞం... శివుడికి అభిషేకాలు

పుట్టపర్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): శివనామస్మరణతో ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ హాల్ మార్మోగింది. విశ్వశాంతి, లోకసంరక్షణ కోసం చేపట్టిన అతిరుద్ర మహాయజ్ఞం ఏడోరోజు గురువారం కూడా కొనసాగింది. సాయికుల్వంత్‌లో వందల మంది పండితులు, యజ్ఞాన్ని కొనసాగించారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు యజ్ఞం కొనసాగింది. శివలింగానికి వేదపండితులు పంచామృతంతో అభిషేకాలు నిర్వహించారు. గణపతి పూజతో యజ్ఞాన్ని మొదలుపెట్టి సర్వదేవతా అర్చనతో కొనసాగించారు. అతిరుద్ర మహాయజ్ఞాన్ని తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. సాయంత్రం సాయికుల్వంత్‌లో నవీన్, ప్రతీక్ బృందం సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

రిజర్వేషన్ ఉద్యోగులపై మంత్రి లోకేశ్‌కు మక్కువ

- ఆర్ఈఎఫ్ నాయకులు
- వీసీకి గజమాలతో సత్కారం



వీసీ సుదర్శనరావును గజమాలతో సత్కరిస్తున్న ఆర్ఈఎఫ్ నాయకులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంలోని రిజర్వేషన్ వర్గాల ఉద్యోగులంటే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు మక్కువని ఆర్ఈఎఫ్ నాయకులు అన్నారు. జేఎన్‌టీయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ సుదర్శనరావును గురువారం వారు గజమాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రిజర్వేషన్ వర్గాలపట్ల అమానవీయంగా వ్యవహరించారన్నారు. నామినేటెడ్, కీలక పదవులకు అర్హత, అనుభవమున్నా నియమించలేదన్నారు. విశ్వవిద్యాలయాల్లో రాజకీయాన్ని చొప్పించి వైసీపీ వారికే పదవులు కట్టబెట్టేవారన్నారు. కూటమి ప్రభుత్వంలో రిజర్వేషన్ వర్గాల ఉద్యోగులకు సముచిత స్థానం కల్పిస్తుండటం అభినందనీయమన్నారు. ప్రొఫెసర్ సుదర్శనరావును వీసీగా నియమించడం ఇందుకు నిదర్శమన్నారు. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రామచంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంటీ నాగభూషణం, నాయకులు రామకృష్ణ, రాజ్‌కుమార్, వెంకటనారాయణ, కుళ్లాయప్ప, ఉమాశంకర్ తదితరులు వీసీని కలిసిన వారిలో ఉన్నారు.

వైసీపీ నాయకుడి భూకబ్జా

భారీ బందోబస్తు మధ్య హక్కుదారులకు స్వాధీనం

శెట్టిపల్లిలో హైటెన్షన్

రెవెన్యూ అధికారులతో కబ్జాదారుల వాగ్వాదం



పత్రాలు చూపుతున్న కరణం వెంకోబరావు మనవళ్లు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో శోత్రియం భూమిని నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి భూకబ్జా బాగోతం బట్టబయలైంది. గురువారం శెట్టిపల్లి మారెమ్మదిన్నె సమీపంలో శోత్రియం 28సెంట్ల భూమిని రెవెన్యూ అధికారులు భారీ పోలీస్ బందోబస్తు మధ్య సర్వే చేయడంతో కృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల వాగ్వాదానికి దిగారు. సర్వేచేసి వెంకోబరావు మనవళ్లకు భూమిని స్వాధీనం చేశారు. వివరాల్లోకెళితే.. శెట్టిపల్లి పంచాయతీలోని మారెమ్మదిన్నె సమీపంలో సర్వే నంబరు 28-2లో 28 సెంట్ల భూమికి వైసీపీ నాయకుడు కృష్ణారెడ్డి అడ్డుపడుతున్నాడు. శోత్రియం భూమిని 2000 సంవత్సరంలో కరణం వెంకోబరావు కుమార్తె సరోజమ్మకు పసుపుకుంకుమ కిందరాసిచ్చారు. వెంకోబరావు కుటుంబ సభ్యులు ఎవరూ గ్రామంలో లేకపోవడంతో వైసీపీ నాయకుడు కృష్ణారెడ్డి భూమిపై కన్నేశాడు. భూమిని కబ్జాచేసి 2022 సంవత్సరంలో కృష్ణారెడ్డి తన భార్య అర్చన పేరుతో ఫేక్‌డాక్యుమెంట్లు సృష్టించి బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న వెంకోబరావు కుటుంబ సభ్యులు చలపతిరావు, రాఘవేంద్రరావు, అరుణ్‌కుమార్ ఇటీవల శెట్టిపల్లిలో తమభూమిని కబ్జాచేశారని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు శెట్టిపల్లిలో రెండ్రోజుల క్రితం సర్వేచేపట్టారు. వెంకోబరావు పేరుతోనే 28 సెంట్ల డైగ్లాట్‌లో ఉందని రెవెన్యూ అధికారులు తేల్చారు. గురువారం రెవెన్యూ అధికారులతో కలిసి వెంకోబరావు కుటుంబ సభ్యులు భారీ పోలీసు బందోబస్తు మధ్య ఎక్స్‌కవేటర్ సాయంతో భూమి చదును పనులు చేస్తుండగా కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు భూమి తమదేనంటూ వాగ్వాదానికి దిగారు. దాదాపు గంటపాటు ఆందోళన జరగడంతో శెట్టిపల్లిలో హైటెన్షన్ నెలకొంది. తహసీల్దార్ శ్రీధర్, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, కృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో మీ వద్ద ఉన్న పత్రాలు తీసుకురమ్మని చెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత సమస్య సద్దుమణిగింది. కృష్ణారెడ్డి కబ్జా చేసిన స్థలాన్ని సర్వేచేసి ఐదుసెంట్ల భూమిలో అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కరణం వెంకోబరావు మనువళ్లు మాట్లాడుతూ.. శెట్టిపల్లిలో తమ తాత పేరుతో గతంలో వంద ఎకరాలకుపైగా ఉండేదన్నారు. తమ తల్లి సరోజమ్మ పేరుతో తాత 28 సెంట్ల భూమిని పసుపుకుంకుమ కింద రాసిచ్చారని అన్నారు. తాము గ్రామంలో లేకపోయేసరికి కృష్ణారెడ్డి అనే వ్యక్తి భూమిని కబ్జాచేశాడని అన్నారు. అధికారులకు విన్నవించడంతో భూమిని ఇప్పించారని అన్నారు. దీంతో 5సెంట్ల స్థలాన్ని అంగన్‌వాడీ భవనానికి రాసిచ్చినట్లు తెలిపారు.

ఫ్రూట్ కేర్‌తో నాణ్యమైన మామిడి

50 శాతం సబ్సిడీతో పంపిణీ: ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఫ్రూట్‌కేర్‌తో నాణ్యమైన మామిడి పంట వస్తుందని ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో మామిడిలో ఫ్రూట్ కేర్‌పై ఎఫ్‌పీఓలు, ఎన్జీఓలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ ఏడాది జిల్లాలో 1000 హెక్టార్లలకు అవసరమైన మామిడి రక్షణ కవచం (ఫ్రూట్ కేర్) పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. 50 శాతం సబ్సిడీతో మామిడి రక్షణ కవచం (ఫ్రూట్ కేర్ కవర్) పంపిణీ చేస్తామని తెలిపారు. ఒక్కో రైతుకు హెక్టారుకు 20వేల రక్షణ కవచం కవర్లు ఇస్తామన్నారు. ఒక్కో కవర్ పూర్తి ధర రూ.2 కాగా సబ్సిడీతో రూ.1కి పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ హెచ్ఓ పల్లవి పాల్గొన్నారు.

చెరువులకు నీరివ్వండి

జలవనరుల శాఖ మంత్రికి పల్లె వినతి



మంత్రికి ప్రతిపాదనలు అందిస్తున్న పల్లె

పుట్టపర్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా నియోజకవర్గంలో 193 చెరువులకు సాగునీరిచ్చే ప్రాజెక్టు పనులను వేగం పెంచి ప్రతి చెరువును నీటితో నింపాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కోరారు. గురువారం అమరావతిలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి పుట్టపర్తి నియోజకవర్గానికి 193 చెరువుల సాగు నీటి ప్రాజెక్టు పనులతోపాటు రిజర్వాయర్ల, కొత్త చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టి భూగర్భ జలమట్టం పెంచాలని విన్నవించారు. సాగునీటి ప్రాజెక్టులు లేక నియోజకవర్గంలో పలు మండలాల్లో భూగర్భజల మట్టం అడుగంటిపోయిందన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా నింపుతున్న చెరువు కరకట్టల పటిష్టంతోపాటు ముళ్ల పొదలను తొలగించాలని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలను మంత్రికి నివేదించారు. స్పందించిన మంత్రి నిమ్మల రామానాయుడు పనులల్లో వేగం పెంచి కొత్త చెక్‌డ్యాంలతోపాటు చెరువుల మరమతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పల్లె రఘునాథ్‌రెడ్డి వెల్లడించారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న అర్చకుడు రామాంజనేయులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో పెద్దకదిరప్ప స్వామి రథోత్సవం సందర్భంగా గురువారం రాతిదూలం లాగుడు పోటీలను ఉత్సాహంగా నిర్వహించారు. ఇందులో 9జతల వృషభాలు పాల్గొన్నాయి. అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లికి చెందిన ఇంద్రారెడ్డి వృషభాలు 5,439అడుగులు లాగి మొదటి బహుమతి కింద రూ. 40వేలు సాధించాయి. తాడిపత్రికి చెందిన శేఖర్‌రెడ్డి వృషభాలు 5,400అడుగులు లాగి రెండో బహుమతి కింద రూ.30వేలు, పెద్దవడుగూరు మండలం లక్ష్మంపల్లికి చెందిన శివారెడ్డి వృషభాలు 4,882 అడుగులు లాగి మూడో బహుమతి కింద రూ.20వేలు, నంద్యాల జిల్లా ప్యాపిలి రంగాపురంకు చెందిన రామకృష్ణారెడ్డికి చెందిన వృషభాలు 4,846 అడుగులు లాగి నాలుగో బహుమతి కింద రూ.15వేలు సాధించాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రామాంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలపై సందిగ్ధం..!



బీసీ కార్పొరేషన్‌లో కొనసాగుతున్న ప్రక్రియ

ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, క్రిస్టియన్ల రుణాలపై కొరవడిన స్పష్టత

యూనిట్ వివరాలు కూడా ఖరారు చేయని దుస్థితి

పదే.. పదే.. మార్పులతో గందరగోళం

విస్మయం వ్యక్తం చేస్తున్న ఔత్సాహికులు



ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ కార్యాలయాల సముదాయం (పెన్నార్ భవన్)

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాలపై సందిగ్ధం నెలకొంది. నేటికీ యూనిట్ల సంఖ్య, విలువను ప్రకటించడంతో దీంతో దరఖాస్తు కూడా చేసుకోలేని దుస్థితి. ఆన్‌లైన్‌లో వివరాలే లేవు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నిరుద్యోగ యువత, వ్యాపారుల స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలను అందజేస్తోంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున ఔత్సాహికులు పోటీ పడుతున్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్లు సబ్సిడీ రుణాలకు మంగళం పలికారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సబ్సిడీ రుణాలివ్వాలని నిర్ణయించడంతో దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. ఇప్పటికే బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ యూనిట్‌గా నిర్ణయించి, దరఖాస్తులు ఆహ్వానించింది. ఔత్సాహికులు వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటికే ఎంపీడీఓ కార్యాలయాల్లో బ్యాంకర్లు, అధికారులతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, క్రిస్టియన్లకు సంబంధించి సబ్సిడీ రుణాలపై మాత్రం నేటికీ స్పష్టత లేదు. దీంతో ఆయావర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇదే విషయమై ఆయా కార్పొరేషన్ల అధికారులను ఆరాతీస్తే... రాష్ట్రస్థాయి నుంచి రుణాలకు సంబంధించి యూనిట్లను కేటాయించారే తప్ప.. వాటికి అనుమతులు రావాల్సి ఉందని చెబుతున్నారు. దీంతో రుణాలపై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగ యువత, ఔత్సాహికులు సందిగ్ధంలో పడ్డారు.

కొనసాగుతున్న ప్రక్రియ

బీసీ కార్పొరేషన్ పరిధిలో 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ మానిటరింగ్ సిస్టం కింద స్వయం ఉపాధి కోసం రూ.2 లక్షల నుంచి రూ.5లక్షల వరకూ యూనిట్లను నిర్ణయించారు. ఈ ఏడాదికి యూనిట్లను కేటాయించారు. జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటు చేసుకునే నిరుద్యోగ యువత కోసం రూ.8 లక్షలు రుణం అందించనున్నారు. నెల రోజులుగా బీసీ కార్పొరేషన్ పరిధిలో రుణాల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. వేలమంది దరఖాస్తు చేసుకున్నట్లు అధికారుల ద్వారా అందిన సమాచారం. కొన్ని మండలాల్లో బ్యాంకర్లు, ఎంపీడీఓల ఆధ్వర్యంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు సైతం నిర్వహిస్తున్నారు.

అనంత జిల్లాకు యూనిట్ల కేటాయింపు ఇలా..

కార్పొరేషన్	కేటాయించిన యూనిట్లు	నిధులు విడుదల
బీసీ	1,728	రూ.32.90కోట్లు
ఈబీసీ	102	రూ.1.77కోట్లు
కమ్మ	58	రూ.1.01 కోట్లు
రెడ్డి	29	రూ.50లక్షలు
ఆర్యవైశ్య	21	రూ.36లక్షలు
బ్రాహ్మణ	14	రూ.24లక్షలు
క్షత్రియ	1	రూ.2లక్షలు
జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటుకు..		
బీసీ	35	రూ.2.80కోట్లు
ఈబీసీ	17	రూ.1.36కోట్లు
కమ్మ	9	రూ.72లక్షలు
రెడ్డి	5	రూ.40లక్షలు
ఆర్యవైశ్య		
బ్రాహ్మణ	6	రూ.48లక్షలు

స్పష్టత ఏదీ?

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సంబంధించిన సబ్సిడీ రుణాల విషయంలో స్పష్టత కొరవడిందనే చెప్పాలి. రాష్ట్రస్థాయిలో అన్ని కార్పొరేషన్లకు యూనిట్లవారీగా రుణాల మంజూరుకు నివేదికలు తయారు చేసినట్లు సమాచారం. ఆ మేరకు ఇప్పటికే ఆయా కార్పొరేషన్ల ఈడీలకు ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తుల విషయంలో మాత్రం రాష్ట్ర అధికారుల నుంచి స్పష్టత కొరవడినట్లు సమాచారం. ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించి అన్ని రకాల పనులు పూర్తయినా రాష్ట్రస్థాయి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియలో స్పష్టత ఇవ్వలేదు. ఎస్టీ కార్పొరేషన్‌లో సబ్సిడీ రుణాలపై ప్రణాళికలే రూపొందించనట్లు సమాచారం. మైనార్టీ కార్పొరేషన్ పరిధిలో రూ.లక్ష కాకుండా... ఏకంగా రూ.5 లక్షలు, రూ.10 లక్షల యూనిట్లు మంజూరు చేయడంతోపాటు... ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పదుల సంఖ్యలోనే కేటాయించినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో సైతం రాష్ట్రస్థాయి అధికారులు పునరాలోచనలో పడటంతో రుణాలపై గందరగోళం నెలకొన్నట్లు ఆయా కార్పొరేషన్ల అధికారుల ద్వారా అందిన సమాచారం. దీంతో పలువురు ఔత్సాహికులు.. ఆయా కార్పొరేషన్ల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.



ప్రతిపాదనలు పంపాం

మైనార్టీ కార్పొరేషన్‌లో సబ్సిడీ రుణాలకు సంబంధించి రాష్ట్రస్థాయి అధికారులు వివరాలు అడిగారు. ఆ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతిపాదనలు పంపాం. అక్కడి నుంచి ఆదేశాలు అందితే... అమలు చేస్తాం.

- సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జి ఈడీ, మైనార్టీ కార్పొరేషన్

కసరత్తు చేస్తున్నాం

గిరిజన కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు సంబంధించి రాష్ట్రస్థాయి నంచి ఆదేశాలు రావాల్సి ఉంది. రుణాలపై కసరత్తు చేస్తున్నాం. రాష్ట్రస్థాయి అధికారులు త్వరలోనే క్లారిటీ ఇస్తామంటున్నారు. వచ్చిన వెంటనే దరఖాస్తులు ఆహ్వానించి, ప్రక్రియ పూర్తి చేస్తాం.

- రామాంజనేయులు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి



జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

- ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



డైరీని ఆవిష్కరిస్తున్న కాలవ శ్రీనివాసులు, సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో ఏపీయూడబ్ల్యూజే-2025 డైరీని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి షేక్ మహ్మద్ అయూబ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేపీ కుమార్, చలపతి, జిల్లా గౌరవ అధ్యక్షుడు భోగేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలను సంఘం నాయకులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జర్నలిస్టుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చొరవ చూపుతానని ఆయన హామీ ఇచ్చారు.

బీసీ రమేష్ గౌడ్‌కు అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న రమేష్‌గౌడ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు బీసీ రమేష్ గౌడ్ అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. ఈ మేరకు 19వ తేదీన దుబాయ్‌లోని దిపాం జుమేరియాలో నిర్వహించిన ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ ఇంటర్నేషనల్ ఎక్సలెన్సీ అవార్డును అందుకున్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురు ప్రముఖులను ఎంపిక చేయగా, అందులో జిల్లా నుంచి బీసీ రమేష్‌గౌడ్‌ను ఎంపిక చేసి అవార్డును అందజేశారు.



కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అమ్మకు అండగా..!

కూడేరు పీహెచ్‌సీలో ఇక మెరుగైన వైద్యసేవలు

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ
రక్తహీనతతో బాధపడుతున్న వారిపై దృష్టి
యాప్ ద్వారా పర్యవేక్షణ
మాతాశిశు మరణాలు తగ్గించడమే లక్ష్యం

కూడేరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా అడుగులు పడుతున్నాయి. 24 గంటల పీహెచ్‌సీ అయినా గర్భిణులు, బాలింతలకు సరైన వైద్యసేవలు అందడంలేదన్నది నిర్వివాదాంశం. మండలంలో అనేకమంది గర్భిణులు రక్తహీనతతోబాధపడుతూ ప్రసవ సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బాలింతలు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర వైద్యశాఖ, స్వస్థి అనే కర్ణాటకకు చెందిన స్వచ్ఛంద సంస్థ పీహెచ్‌సీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోని ఆస్పత్రిని మోడల్ పీహెచ్‌సీగా ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల వైద్యశాఖ డైరెక్టర్ వీరపాండియన్, స్వస్థి ప్రతినిధులు, జిల్లా వైద్యాధికారులు ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో కల్పించాల్సిన వసతులపై ఆరా తీసి, వెళ్లారు.

సిబ్బంది సమస్య తీరేనా..?

మోడల్ పీహెచ్‌సీగా ఎంపికైన కూడేరు పీహెచ్‌సీలో సమస్యలు తీరుతాయా అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆస్పత్రిలో ఆరు పడకలు మాత్రమే ఉన్నాయి. ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు ఉన్నారు. సీహెచ్‌ఓలు ఇద్దరు ఉండాల్సిన చోట ఒక్కరూ లేరు. పీహెచ్ఎన్ పోస్టు ఖాళీగా ఉంది. డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులేదు. ఉన్న సిబ్బందిపై పనిభారం పెరిగి, 24 గంటలు వైద్యసేవలు అందకుండా పోవడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య పథకాలు సకాలంలో అందకుండా పోతున్నాయనే వాదనలున్నాయి. ఇపుడైనా పోస్టులను భర్తీచేసిం మెరుగైన వైద్యసేవలు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



జనని మిత్ర యాప్‌ను కూడేరులో ఆవిష్కరిస్తున్న వైద్య శాఖ డైరెక్టర్ వీరపాండియన్, కలెక్టర్ (ఫైల్)

ప్రత్యేకంగా జనని మిత్ర యాప్



కూడేరు మండలంలో గర్భిణులు, బాలింతలు అధికమంది రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రస్తుతం మండలంలో 290 మంది గర్భిణులు ఉన్నారు. పదిమంది వరకు 7 శాతం లోపు, 13 మంది 10 శాతంలోపు రక్తం కలిగి ఉన్నట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. వీరందరూ వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఈ ప్రభావం కడుపులోని శిశువుల ఎదుగుదలపై పడుతోంది. జిల్లాలో అధికమంది రక్తహీనతతో బాధపడుతున్న మండలాల జాబితాలో కూడేరు ఉంది. రక్తహీనత ప్రమాదం నుంచి తప్పించడంపై రాష్ట్ర వైద్యశాఖ దృష్టి సారించింది. ఏఐ సాంకేతికతతో జనని మిత్ర ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఆ యాప్‌ను కూడేరులోనే వైద్యశాఖ డైరెక్టర్ ఇటీవల ఆవిష్కరించారు.



జనని యాప్‌పై గర్భిణీకి అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రక్తహీనత బాధితులకు అవగాహన

రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల సమాచారం మొత్తం జనని మిత్ర యాప్‌లో నమోదుచేసి ఉంటుంది. యాప్ ద్వారా నాలుక, కళ్లు, గోర్లను స్కాన్ చేస్తే వారికి ఎంత రక్తంఉంది, అది పెరగడానికి ఎలాంటి ఆహారం, పండ్లు, ఆకుకూరలు తీసుకోవాలి, వాతావరణంలో మార్పులు వచ్చినపుడు ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి, గర్భిణులు చేయాల్సిన వ్యాయామం తదితర వివరాలు తెలియజేస్తారు. వైద్యం ఎలా పొందాలి, ఏయే మాత్రలు, మందులు తీసుకోవాలో వివరిస్తారు. డాక్టర్ల వద్దకు వెళ్లకుండానే ఉన్నచోటనే ఈ యాప్ ద్వారా గర్భిణులు రోజూ వారి ఫోన్‌లోనే చూసుకుని, తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లను వైద్యశాఖ చేపట్టింది.



మాతాశిశు సంరక్షణకే ప్రాధాన్యం

మండలంలో అనేకమంది గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో ఇబ్బంది పడుతున్నారు. ఈ కారణంగా గర్భంలో శిశువు ఆరోగ్యంగా అభివృద్ధి చెందట్లేదు. అలాంటి వారు ప్రసవ సమయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అలాంటి వారిపై జనని మిత్ర యాప్ ద్వారా ప్రత్యేక దృష్టి పెట్టొచ్చు. తద్వారా మాతాశిశు మరణాలు తగ్గించవచ్చు. ఇప్పటికే యాప్‌పై మండలంలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. దీనిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

-డాక్టర్ లక్ష్మీనారాయణ, వైద్యాధికారి, కూడేరు పీహెచ్‌సీ

హాస్టళ్లపై నిర్లక్ష్యం

సమీపిస్తున్న పదో తరగతి పరీక్షలు

పేద పిల్లల విద్యపట్ల సంక్షేమశాఖ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. వివిధ సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించడం, ట్యూటర్లతో క్లాసులు చెప్పించడాన్ని గాలికొదిలేశారు. ఉన్నతాధికారులు సమావేశాలతో సరిపెడుతున్నారు. కనీస పర్యవేక్షణ లేకపోవడంతో చాలాచోట్ల స్టడీ అవర్స్ కూడా నిర్వహించలేదు. ఇలాగైతే ఉత్తమ ఫలితాలు ఎలా సాధ్యమవుతాయో ఉన్నతాధికారులకే తెలియాలి.

కొరవడిన పర్యవేక్షణ
తూతూమంత్రంగా స్టడీ అవర్స్
విద్యార్థుల సంక్షేమం పట్టని ఉన్నతాధికారులు



అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గత వైఫల్యాలను గుర్తెరిగి సంక్షేమ వసతిగృహాల్లో పదో తరగతి ఫలితాలను మెరుగుపరుస్తారా..? వంద శాతం వైపుగా సాగి... పదిపై పట్టు సాధిస్తారా..? అంటే క్షేత్రస్థాయిలో పరిస్థితులు చూస్తుంటే సందేహాలు కలుగుతున్నాయి. పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగాలని, సంక్షేమశాఖల అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని, వార్డెన్లు స్థానికంగా అందుబాటులో ఉంటూ పక్కాగా స్టడీ అవర్స్‌ను నిర్వహించాలని ఉన్నతాధికారులు సమీక్షలతోనే సరిపెడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. డివిజన్ల వారిగా ప్రేరణ తరగతులు నిర్వహించడం... వార్డెన్లకు ఆదేశాలు జారీ చేయడం తప్పా.. క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారులు పరిశీలించలేదని తెలుస్తోంది. పలుచోట్ల స్టడీ అవర్స్ సక్రమంగా నిర్వహించలేదని సమాచారం. కొన్ని చోట్ల ట్యూటర్లే లేకపోవడంతో పదో తరగతి విద్యార్థుల పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రతి ఏడాది వసతిగృహాల్లో పది ఫలితాల ఉత్తీర్ణత పడిపోతూ వస్తోంది. గతంలో కూడా 50శాతంలోపే ఉత్తీర్ణత సాధించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. గత వైఫల్యాలను గుణపాఠాలుగా నేర్చి ఈసారి పది ఫలితాలపై పట్టు సాధిస్తారా..? లేదా ప్రతి ఏడాదిలాగానే చేతులెత్తేస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గరపడుతున్నప్పటికీ... సంక్షేమ వసతిగృహాల్లో ఆ భయం ఎక్కడా కనిపించడం లేదు.

పర్యవేక్షణ ఏదీ..?

పది పరీక్షలు వస్తున్నాయంటే.. సంక్షేమ వసతిగృహాల ఉన్నతాధికారులు ప్రతిరోజూ ఏదో ఒక హాస్టల్‌ను తనిఖీ చేస్తూ విద్యార్థులు ఏ మేరకు చదువుతున్నారో పర్యవేక్షించాల్సి ఉంటుంది. వార్డెన్లు అందుబాటులో ఉంటున్నా రా...? ట్యూటర్లు ఉన్నారా..? స్టడీ అవర్స్‌కు టీచర్స్ వస్తున్నారా...? తదితర అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. వార్డెన్లతో సమావేశం ఏర్పాటు ఉత్తీర్ణత సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కసరత్తులు తదితర అంశాలపై సూచనలు, సలహాలు తెలియజేయాల్సి ఉంటుంది. వార్డెన్లు పరీక్షలు ముగిసేంత వరకూ నిత్యం విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి. జిల్లాలోని పలు సంక్షేమ శాఖ వసతిగృహాల్లో ఆ ఛాయలు ఎక్కడా కనిపించలేదు. ఇలాగే కొనసాగితే ఈ ఏడాది కూడా ఫలితాలు దారుణంగా పడిపోయే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికైనా ఆయా సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు నిద్రమేల్కొని పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ పక్కాగా నిర్వహించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



స్టడీ అవర్స్‌లో చదువుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

మూడేళ్లుగా 50 శాతంలోపే...



2022-23లో ఏడాదిలో ఉత్తీర్ణత శాతం పేవలంగా ఉంది. అప్పట్లో జిల్లాలోని బీసీ సంక్షేమశాఖ పరిధిలోని 36 వసతిగృహాల్లోని 589 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 240 మంది ఉత్తీర్ణత సాధించగా... 349 మంది ఫెయిలయ్యారు. ఎస్సీ సంక్షేమశాఖ పరిధిలోని 35 వసతి గృహాల్లోలో 436 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా... 106 మంది ఉత్తీర్ణత సాధించగా... 330 మంది ఫెయిలయ్యారు. ఎస్టీ సంక్షేమశాఖ పరిధిలో రెండు జిల్లాలోని వసతిగృహాల్లో 86 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా... కేవలం 11 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 75 మంది ఫెయిలయ్యారు. ఆ సంవత్సరం మొత్తంగా 35 శాతమే ఉత్తీర్ణత సాధించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 2024 సంవత్సరంలో 50 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే వందశాతం కలగా మారిపోయేలా ఉందడనంలో ఎలాంటి సందేహం లేదు.

భూ తగాదాతోనే హత్య

యూట్యూబర్‌ను ట్రాక్టర్‌తో ఢీకొట్టి కాలువలో పడేశారు
కేసును ఛేదించిన కసాపురం పోలీసులు
ముగ్గురు నిందితుల అరెస్టు.. ట్రాక్టర్, బైక్ సీజ్

నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు



గుంతకల్లు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): యూట్యూబర్ తిరుమల రెడ్డి(42)ని హత్య చేసినట్లు కసాపురం పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను గురువారం అరెస్టుచేశారు. కసాపురం పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి, కేసు వివరాలను రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. బుగ్గసంగాల గ్రామానికి చెందిన వై జీవన్ కుమార్.. తన పరిచయస్థులు బి.రామాంజనేయులు, బి.రామన్న సహకారంతో తిరుమల రెడ్డిని హతమార్చాడని తెలిపారు. బుగ్గసంగాలలో జీవన్‌కుమార్‌కు నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. దాని పక్కనే ఉన్న ఒక ఎకరం ప్రభుత్వ భూమిని కూడా అతను చదను చేసుకున్నాడు. దీనికి తిరుమల రెడ్డి అభ్యంతరం తెలిపాడు. తహసీల్దారుకు ఫిర్యాదు చేశాడు. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించి, ప్రభుత్వ భూమిని ఆక్రమించవద్దని జీవన్ కుమార్‌కు సూచించారు. ఆక్రమణ గురించి కలెక్టరుకు కూడా ఫిర్యాదు చేస్తానని తిరుమల రెడ్డి హెచ్చరించడంతో అతడిపై జీవన్ కుమార్ కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 18వ తేదీ ఉదయం దాదాపు 8 గంటల ప్రాంతంలో తిరుమల రెడ్డి గుంతకల్లులోని తన ఇంటి నుంచి బైక్‌లో బుగ్గసంగాలలోని తన పొలానికి బయలుదేరాడు. సమాచారం తెలుసుకున్న జీవన్ కుమార్ బుగ్గసంగాల శివారులోని హంద్రీనీవా కాలువ వద్ద కాపుకాచి బైక్‌ను ట్రాక్టరుతో ఢీకొట్టి తీవ్రంగా గాయపరిచాడు. సంగాలకు చెందిన రామాంజనేయులు, కసాపురానికి చెందిన రామన్న సహకారంతో అపస్మారక స్థితిలో ఉన్న తిరుమలరెడ్డిని హంద్రీనీవా కాలువలోకి నెట్టేశాడు. మృతుడి కుటుంబ సభ్యులు జీవన్ కుమార్‌పై అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. ముగ్గురు నిందితులను అరెస్టుచేసి, వారు ఉపయోగించిన ట్రాక్టరు ఇంజన్, బైక్, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని అన్నారు. కేసును పరిష్కరించిన కసాపురం ఎస్ఐ వెంకట స్వామి, హెచ్‌సీ వెంకటేశ్, కానిస్టేబుళ్ల జాఫర్, కిషోర్ కుమార్, రాఘవేంద్ర, నాగేశ్వరరావ్, అంజి, నూర్ మహమ్మద్‌ను సీఐ అభినందించారు.

ప్రతిష్ఠాత్మకంగా పీ-4 మోడల్ సర్వే

- సీఎస్‌కు వివరించిన కలెక్టర్ వినోద్‌కుమార్
- గ్రూప్-2 పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ-4మోడల్ సర్వేను ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కు కలెక్టర్ వినోద్‌కుమార్ వివరించారు. గురువారం సీఎస్ కలెక్టర్, జేసీ తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ మోడల్‌సర్వే, గ్రూప్-2, ఇంటర్ పరీక్షలు, ఎంఎస్ఎంఈ సర్వేతదితర అంశాలపై సమీక్షిస్తూ పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అంశాల ప్రగతి, చేపట్టిన చర్యలపై కలెక్టర్ వివరించారు. పీ-4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) మోడల్ సర్వేను ప్రతిష్ఠాత్మకంగా మొదలుపెట్టామని అన్నారు. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు ఈ సర్వేపై శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. సర్వేలో మండల, నియోజకవర్గ స్థాయి అధికారులను భాగస్వామ్యులను చేశామని తెలిపారు. పరీక్షల నిర్వహణపై తీసుకున్న చర్యలు, ఏర్పాట్ల గురించి వివరించారు.

పగడ్బందీగా నిర్వహించాలి

ఈనెల 23న గ్రూప్-2 పరీక్షలను పగడ్బందీగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా యంత్రాంగాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్-2 పరీక్షను జాయింట్ కలెక్టర్ పర్యవేక్షిస్తారని అన్నారు. మొత్తం 14 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయని, ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాల నిఘా ఉండాలని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ అన్ని కేంద్రాలను తనిఖీచేసి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఇంటర్ పరీక్షలకు డీఐఓ ఇన్‌చార్జ్‌గా ఉంటారని అన్నారు. పరీక్షల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయించాలన్నారు. అన్ని కేంద్రాల్లోనూ పూర్తిస్థాయిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, డీఈఓ ప్రసాద్‌బాబు, డీఐఓ వెంకటరమణానాయక్, డీపీఓ నాగరాజునాయుడు, సీపీఓ అశోక్‌కుమార్, సీఈఓ రామచంద్రారెడ్డి, పరిశ్రమశాఖ మేనేజర్ శ్రీధర్, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరి షరీఫ్, ఉపాధి కల్పనాధికారి కళ్యాణి పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఈ నెల 23న జరగనున్న గ్రూప్-2 పరీక్షల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే తెలియజేయడానికి కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. సమాచారం కోసం 18004258804. 08554-213722 నెంబర్లకు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

23న రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీలు

గార్లదిన్నె, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో ఈనెల 23న రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడుపోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జయరాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవాలలో భాగంగా రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి రూ. 50వేలు ముంటిమడుగు కేశవరెడ్డి, రెండో బహుమతి రూ.40వేలు భాస్కర్ ఫర్టిలైజర్ లిమిటెడ్ ఎండీ విజయభాస్కర్, మూడో బహుమతి రూ.30వేలు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, నాల్గవ బహుమతి రూ. 20వేలు టీడీపీ సీనియర్ నాయకుడు గేట్ క్రిష్ణారెడ్డి, ఐదో బహుమతి రూ. 10వేలు కోటంక స్టోర్ డీలర్ కేశవయ్య, 6వ బహుమతి రూ. 5వేలు ఈశ్వరయ్య అందచేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9885146131, 9441267743 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎద్దు పొడిచిన వ్యక్తి మృతి

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎద్దు పొడవడంతో తీవ్రంగా గాయపడిన మండలంలోని గుడిపల్లికి చెందిన బోయ తిప్పయ్య (55) చికిత్స పొందుతూ మరణించాడు. కొన్నిరోజుల క్రితం తిప్పయ్య తన ఇంటి ముందు ఎద్దులకు నీరు పెడుతుండగా ఒక ఎద్దు పొడిచింది. కొమ్ములతో కడుపులోకి పొడిచి, పైకి ఎత్తి కిందికి వేసింది. తీవ్రంగా గాయపడిన అతడిని వెంటనే అనంతపురంలోని సవీరా ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేయించుకుని అతడు ఈనెల 15వ తేదీన డిశ్చార్జ్ అయ్యాడు. ఈనెల 19న రక్తపు వాంతులు చేసుకోవడంతో కళ్యాణదుర్గం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎద్దు పొడవడంతో అయిన తీవ్ర రక్తగాయం నుంచి తిప్పయ్య కోలుకోలేక అదేరోజు మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు.

ముస్లింలను మరచిపోం

- రంజాన్ నుంచే తోఫా పంపిణీ
- షాదీ మహల్ నిర్మాణానికి రూ.30 లక్షలు కేటాయిస్తా
- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



మహాసమ్మేళనంలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కూటమి విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో ముస్లింలు తమవంతు కృషి చేశారని, వారిని ప్రభుత్వం ఎన్నటికీ మరవదని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఇండియన్ ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని లలితకళా పరిషత్‌లో నిర్వహించిన మహాసమ్మేళనంలో 120 మంది స్వచ్ఛంద సేవకులు, సేవాసంస్థల నిర్వాహకులకు 'అనంత సర్వీస్ ఐకాన్' అవార్డులను అందజేశారు. కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరై అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కరోనా విపత్కర సమయంలో తమ కుటుంబాలను సైతం పక్కన పెట్టి ఎంతో మంది ముస్లింలు కులమతాలకు అతీతంగా అన్నివర్గాలకు సేవా కార్యక్రమాలు, మృతులకు అంత్యక్రియలు చేశారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ముస్లింలను అణగదొక్కిందని పేర్కొన్నారు. వచ్చే రంజాన్ మాసం నుంచే ముస్లింలకు రంజాన్ తోఫాను అందజేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతపురంలో షాదీ మహల్ నిర్మించేందుకు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.30 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో టౌన్ బ్యాంకు అధ్యక్షుడు జేఎల్ మురళీధర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సాలార్ బాషా, టీడీపీ నాయకులు ఉమర్ ముక్తియార్, సైఫుద్దీన్, జనబలం బాబా, డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్, జాకీర్, ప్రజాబలం నజీర్, టిప్పు సుల్తాన్, మాధవ్, సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, ఆశ్రయ క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

కొత్తచెరువు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడపగానిపల్లి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం పడి ఉండటాన్ని గురువారం గమనించిన స్థానికులు హిందూపురం రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఆ మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదని, రైలు ఢీకొని ఉండటంతో ముఖం గుర్తుపట్టలేని విధంగా ఉందని, దీంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసుకున్నామని ఆ పోలీసులు చెప్పారు. మృతుడికి సుమారు 60 సంవత్సరాలు ఉంటాయని, ఎవరైనా ఆచూకీ తెలిస్తే.. 94907 98793 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఇది హత్యా. లేక ఆత్మహత్యా అనేది పోస్టుమార్టం నివేదికతో తేలాల్సి ఉందన్నారు

ఉపాధ్యాయుడి మృతి



గౌసులాజం (ఫైల్)

కొత్తచెరువు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కొండకింద మండల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గౌసులాజం (42) అనారోగ్యంతో గురువారం మరణించాడు. బుధవారం చెవి నొప్పిగా ఉందంటూ తన ఇంటి వద్ద కళ్లు తిరిగి పడిపోయాడు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు అతన్ని అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను గురువారం మరణించాడు. గౌసులాజంకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య

లేపాక్షి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చెట్టుకు ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం లేపాక్షి పెద్దచెరువు వద్ద వెలుగుచూసింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇదే మండలం కుర్లపల్లికి చెందిన రామాంజనేయులు(32)అనే యువకుడు మద్యానికి బానిసయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తిచెంది లేపాక్షి పెద్దచెరువు కట్ట వద్ద చింతచెట్టుకు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుర్లపల్లికి చెందిన సాకమ్మ రెండో కుమారుడిగా గుర్తించారు. ఇతడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వంద టన్నులు దాటిన చీనీకాయలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో చీనీ కాయలు వంద టన్నులు దాటాయి. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి వందలోపు దిగుబడుల వచ్చేవి. గురువారం మార్కెట్‌కు 127టన్నుల కాయలు వచ్చాయి. సంబంధిత అధికారులు ఈనామ్ పద్ధతిలో వేలం నిర్వహించారు. టన్ను గరిష్ఠంగా రూ.22,250, కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.12వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

878 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 878 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 724 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.675 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

రుద్రాక్షల అలంకరణలో కాశీవిశ్వేశ్వరుడు



స్వామివారి నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం స్వామివారు రుద్రాక్షల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాకార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఆవరణలో దీక్షాహోమం చేశారు. సాయంత్రం వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన వ్యాఘ్ర వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని ఆసీనులు గావించి రుద్రాక్షలతో అలంకరించి మొదటిరోడ్డు, మూడవ రోడ్లమీదుగా ఊరేగించారు. ఆలయ ఆవరణలో గురుకృప సంగీత నృత్య కళానిలయం నాట్యాచార్యుడు పట్నం శివప్రసాద్ శిష్యబృందంచే కూచిపూడి, భరతనాట్య నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, నరేంద్ర చౌదరి, శ్రీనివాసులు, ఎర్రిస్వామి ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ పరికరాల విరాళం: మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయానికి కెనరా బ్యాంకు న్యూటౌన్ బ్రాంచి ఆధ్వర్యంలో సీయస్ఆర్ గ్రాంట్ కింద రూ.లక్ష విలువ చేసే ఎలక్ట్రానిక్ పరికరాలు విరాళంగా ఇచ్చారు. గురువారం సాయంత్రం ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబును కలిసి 3 కెన్‌స్టార్ కూలర్లు, 3 పెడస్టల్ ఫ్యాన్‌లు, 6 వాల్ ఫ్యాన్‌లు, 2 సీలింగ్ ఫ్యాన్‌లను అందజేశారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వన్నూర్‌స్వామి, కెనరాబ్యాంకు మేనేజర్ రాహుల్, డీఎం శరణ్‌కుమార్, సిబ్బంది నరేంద్ర చౌదరి, ఎర్రిస్వామి, రాజు, జిజే వేణు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ క్రీడాకారిణికి అభినందన



అనూషాకు షీల్డును అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన ఆత్మకూరు గ్రామానికి చెందిన అనూషాను గురువారం వెంకటాపురంలో ఎమ్మెల్యే పరిటాల సునీత అభినందించారు. విద్యార్థినికి శాలువా కప్పి షీల్డును అందజేశారు. గ్రామీణస్థాయి నుంచి జాతీయస్థాయికి ఎంపికవడం గర్వించతగ్గ విషయమన్నారు. విద్యార్థినిని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది అంతర్జాతీయస్థాయికి ఎదగాలన్నారు. టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజి, నాయకులు కందుల ఓబుశపతి, రామదాసు, అక్కులన్న పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు



దరఖాస్తుదారులతో కిటకిటలాడుతున్న ఎంపీడీఓ కార్యాలయం

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రుణాలు తీసుకున్న వారు తిరిగి సక్రమంగా చెల్లిస్తారా అంటూ దరఖాస్తుదారులను అధికారులు ప్రశ్నించారు. గురువారం మండలంలో సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించా రు. ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, ఏఓ శ్రీనివాసులు, ఆకుతోటపల్లి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబు తదితరులు ఇంటర్వ్యూలు చేశారు. ఎ.నారాయణపురం, అక్కంపల్లి, ఆ లమూరు, చిన్నంపల్లి, కక్కలపల్లి, కక్కలపల్లి కాలనీ, కామారుపల్లి, కట్టకిందపల్లి, కొడిమి, కురుగుంట, రాచానపల్లి, రుద్రంపేట, రాజీవ్‌కాలనీ, సోములదొడ్డి, తాటిచెర్ల నర్సనాయునికుం ట ప్రాంతాల్లోని దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు చేపట్టారు. 360మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు.

ల్యాబ్ రిపోర్టులు సకాలంలో అందించాలి

అనంతపురంటౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు సంబంధించిన ల్యాబ్‌రిపోర్టులు సకాలంలో అందించాలని ల్యాబ్‌టెక్నీషియన్లను ఆస్పత్రిసూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు ఆదేశించారు. గురువారం ఆస్పత్రిలోని సమావేశమందిరంలో ల్యాబ్‌టెక్నీషియన్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ల్యాబ్‌టెక్నీషియన్లపై అనేక ఆరోపణలు వస్తున్నాయని జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇకనుంచి ప్రతిరోజు సాయంత్రం 4గంటలకు ప్రతిల్యాబ్‌రిపోర్టు అందించాలని ఆదేశించారు. డ్యూటీల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, ఆర్ఎంఓ రామక్రిష్ణ, డిప్యూటీ ఆర్ఎంఓలు హేమలత, పద్మజ, హెచ్ఓడీలు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పిస్తాం: డీపీఓ

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తాం, క్షేత్రస్థాయిలో అధికారులు ప్రజలకు మెరుగైన సేవలందించేలా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు సూచించారు. గురువారం పామిడి మండలంలోని నీలూరు పంచాయతీలో ఆకస్మిక తనిఖీ చేశారు. చెత్త నుంచి సంపదతయారి కేంద్రాన్ని పరిశీలించి నిర్వహణ మరింత మెరుగుపడాలని ఈఓఆర్డీ, కార్యాదర్శికి సూచించారు.

ఓపీ హీట్.. కూల్‌కు వైట్‌వాష్..!

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎండలు పెరిగాయి. ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే రోగులకు ఓపీ చీటీలు ఇవ్వడానికి రేకులషెడ్‌లో కౌంటర్లు ఏర్పాటు చేశారు. రోజుకు రెండువేల మంది వరకు రోగులు వస్తుంటారు. ఆ రేకులు ఎండవేడిమికి హీటెక్కి రోగులు ఓపీ చీటీలు తీసుకునేందుకు వెళితే ఉక్కపోతకు గురైఅల్లాడిపోతూవస్తున్నారు. గత ఎండాకాలంలో ఈ ఓపీచీటీలవద్ద రోగులు అనేక అవస్థలు పడ్డారు. కొందరు సొమ్మసిల్లిపడిపోయిన సంఘటనలు జరిగాయి. ఈసారి జిల్లా ఆస్పత్రి వైద్యాధికారులు ముందస్తుగా ఓపీకేంద్రాల వద్ద ఎండవేడిమిని తగ్గించడానికి చర్యలు చేపట్టారు. ఎండను తగ్గించేందుకు రేకుల షెడ్డుపై చల్ల ఉండేందుకు వైట్‌వాష్ వేయిస్తున్నారు.



ఓపీకేంద్రం రేకులషెడ్‌పై వైట్‌వాష్ చేయిస్తున్న దృశ్యం

తాగునీటి ప్రాజెక్టుకు మోక్షమెన్నడో..?

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని వైనం
- పాలకుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం



ఎంపీఆర్ డ్యాంలో పెండింగ్‌లో ఉన్న ఇన్‌టెక్‌వీల్

గార్లదిన్నె, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలానికి పై భాగాన మిడ్ పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్) ఉంది. ఈ ప్రాజెక్టు వద్దే గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వం తాగునీటి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. పనులు కూడా ముమ్మరంగా చేపట్టారు. 80 శాతం పైగా పనులు పూర్తయ్యాయి. అంతలోనే వైసీపీ ప్రభుత్వం రావడంతో పనులు నిలిచిపోయాయి. మండలంలోని పలు గ్రామాలకు తాగునీటిని అందించేందుకు 2017లో ఎంపీఆర్ డ్యాం కట్టపై ఎన్ఆర్‌డీడీడబ్ల్యూటీ గ్రాంటు (సీపీడబ్ల్యూఎస్) పథకం ద్వారా రూ.40కోట్లతో తాగునీటి ప్రాజెక్టును మంజూరు చేసింది. ద్వారా ఎంపీఆర్ డ్యాంలోని నీటిని ఫిల్టర్ చేసి సంపులు, వాటర్ ట్యాంకులు, పైపులైన్ల ద్వారా పెనకచెర్ల, కొట్టాలపల్లి, కేశాపురం తదితర గ్రామాల మీదుగా కల్లూరు వరకు తాగునీరు సరఫరా చేసేందుకు ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. పనులు టీడీపీ హయాంలో వేగంగా జరిగాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రాజెక్టు పనులు చతికిలపడ్డాయి. దీంతో నేటికీ ప్రాజెక్టు పనులు పూర్తి కాలేదు. ఇప్పటికే ప్రాజెక్టు పనులు గడువును రెండు సార్లు పొడగించినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి అవుతుంది? తాగునీటి సమస్య తీరేదెన్నడని ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు.

కాంట్రాక్టర్లు కోర్టుకు వెళ్లారు

- సురేష్, ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్, అనంతపురం

తాగునీటి ప్రాజెక్టు 2019 సంవత్సరానికి పూర్తి కావాల్సి ఉంది. ఎన్నికల సమయానికి 80 శాతం పనలుఉ పూర్తి అయ్యాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు రావాల్సింది వాస్తవమే. బిల్లుల కోసం కాంట్రాక్టర్లు కోర్టుకు వెళ్లారు. తాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడతాం.

బిల్లుల కోసం కోర్టును ఆశ్రయించాం

- ప్రభాకర్, కాంట్రాక్టర్

తాగునీటి ప్రాజెక్టు పనులు 80 శాతం పైగా పూర్తయ్యాయి. తమకు అప్పగించిన పనులకంటే ఎక్కువే చేశాం. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులు పూర్తి అయ్యాయి. డ్యాంలో నుంచి నీరు పంపింగ్ చేసేందుకు ఇన్‌టెక్ వీల్ మొదట 40 మీటర్లకు అప్రూవల్ ఇచ్చారు. తరువాత 80 మీటర్లు చేయాలని చెప్పారు. 80 మీటర్లు చేసిన తరువాత 120 మీటర్లు చేయాలని చెప్పారే తప్ప అప్రూవల్ చేయలేదు. కిందస్థాయి అధికారులు అప్రూవల్ చేశారు. ఉన్నతాధికారులు చేయలేదు. దీంతో పనులు చేయలేదు. రూ.3 కోట్లకు పైగా బిల్లులు రావాల్సి ఉంది. సమస్యపై కలెక్టర్ దృష్టికి, ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లాం. బిల్లులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని హైకోర్టును ఆశ్రయించాం.

ప్రాజెక్టు పూర్తయితేనే నీటి సమస్య పరిష్కారం



ఎంపీఆర్ డ్యాంపై నిర్మించిన తాగునీటి ప్రాజెక్టు పూర్తయితేనే గ్రామాల్లో తాగునీటికి శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా పెనకచెర్ల, కొట్టాలపల్లి, కామలాపురం గ్రామాల మీదుగా కల్లూరుకి పైపులైన్ ఏర్పాటు చేశారు. పనులు చేపట్టి ఎనిమిదేళ్లుగా కావస్తున్నా కల్లూరుకు నీరు రావడం లేదు. ప్రతి వేసవిలో నీటికోసం ఇబ్బందులు పడుతున్నాం. కూటమి ప్రభుత్వమైనా ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలి.

- చాంద్‌బాషా, కల్లూరు

గత పాలకుల వైఫల్యమే



ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా సాగు, తాగునీటి ప్రాజెక్టుల పనుల్లో నిర్లక్ష్యం చేయడం సరికాదు. తెలుగుదేశం ప్రభుత్వంలో మంజూరైన తాగునీటి ప్రాజెక్టు, వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యంతోనే పనులు పూర్తి కాలేదు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని కాంట్రాక్టరుకు రావాల్సిన బిల్లులు చెల్లించి పనులు పూర్తి చేసి గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి.

- ఆంజనేయులు, కేశవాపురం

హుండీలో నగదు చోరీ

రాప్తాడు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరు ఆంజనేయులు స్వామి దేవాలయం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు హుండీలో నగదు చోరీ చేశారు. రాప్తాడు పోలీసులు తెలిపిన మేరకు మరూరు అంజనేయస్వామి దేవాలయంలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు సీసీ కెమెరాలు ధ్వంసం చేసి హుండీని పగలగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. దేవాలయంలోని టీవీ మానిటర్‌ను ఎత్తుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

గార్లదిన్నె, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన సదాశివారెడ్డి (65) అనే రైతు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు రైతు సదాశివారెడ్డి, లక్ష్మీకాంతమ్మ దంపతులు. వారికున్న 15 ఎకరాల్లో దానిమ్మ, జామ పంటలు సాగుచేస్తూ జీవనం సాగించేవారు. పంటల సాగుకోసం చేసిన అప్పులు అధికమయ్యాయి. అప్పులు తీర్చే మార్గం లేక వారంరోజుల క్రితం పెనకచెర్లలో బంధువుల ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గురువారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

130 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం సీజ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కణేకల్లు గ్రామంలో తనిఖీ చేశారు. గ్రామంలోని రాంనగర్‌లో జంగం బసవరాజుకు చెందిన నివాసం సమీపంలో ఐషర్ వాహనాన్ని తనిఖీ చేసి పరిశీలించారు. కర్ణాటక రాష్ట్రం పావగడకు పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనంతోపాటు అందులో ఉన్న 130 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. స్థానిక కణేకల్లు సీఎస్‌డీకి సీజ్ చేసిన బియ్యాన్ని అప్పగించినట్లు సీఐ తెలిపారు. కణేకల్లుకు చెందిన బసవరాజు, బుక్కపట్నం మండలం దూపంపల్లికి చెందిన వేణుగోపాల్ (వాహన డ్రైవర్)ను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇంటింటి సర్వేపై కమిషనర్ ఆరా

అనంతపురం క్రైం,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): నగర కమిషనర్ బాలస్వామి గురువారం ఇంటింటి సర్వేపై ఆరా తీశారు. నగరంలోని 36వ డివిజన్ 52వ సచివాలయ పరిధిలో సీ 16 క్లస్టర్‌లో సర్వే నిర్వహించారు. సర్వేకు సంబంధించి యాప్‌లో నమోదు చేయాల్సిన వివరాలను సంబంధిత సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు.

టీసీసీ పరీక్షలకు 143 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు గురువారం 143 మంది గైర్హాజరైనట్లు డీఈఓ ప్రసాద్ బాబు, ఏసీ గోవింద్ నాయక్ తెలిపారు. మొదటి రోడ్డులోని శారదా స్కూల్, పాతూరులో కస్తూర్బాగాంధీ మున్సిపల్ స్కూల్‌లోని పరీక్షా కేంద్రాల్లో టీసీసీ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షాకేంద్రాలను ఏసీ గోవింద్ నాయక్ తనిఖీ చేశారు.

పుట్టకనుమ రోడ్డుకు మరమ్మతులు



మలుపు వద్ద ఎక్స్‌కవేటర్‌తో మట్టిని చదును చేస్తున్న దృశ్యం

కనగానపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రమాదకర పుట్టకనుమ ఘాట్ రోడ్డుకు మట్టితో చదును చేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ప్రమాదాలకు నిలయంగా పుట్టకనుమ ఘాట్ రోడ్డు అనే కథనం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన తగరకుంట సర్పంచ్ మాదవరాజు గురువారం మట్టితో గుంతలు పూడ్చి తాత్కాలిక చర్యలు చేపట్టారు. కోతకు గురైన రోడ్డును బాగుచేయడంపై వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

పెన్షన్ కోసం కొడుకుల గొడవ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తల్లికి వచ్చే పెన్షన్ కోసం కొడుకుల మధ్య జరిగిన గొడవపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శాంతిలాల్ తెలిపిన మేరకు.. కక్కలపల్లికాలనీకి చెందిన చాకలి నారప్ప కరెంట్ ఆఫీస్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ మృతి చెందాడు. ఆ పెన్షన్ అతని భార్యకు వస్తోంది. గురువారం పెన్షన్ డబ్బుల కోసం కొడుకులు చాకలి చంద్రాయుడు, వెంకటేష్ గొడవపడ్డారు. ఇంతలో వెంకటేష్‌కు మద్దతుగా అతని బావ రాజశేఖర్ వచ్చాడు. రాజశేఖర్ ఇనుపరాడ్డుతో చంద్రాయుడిపై దాడి చేశాడు. దీంతో అతనికి గాయాలయ్యాయి. చంద్రాయుడి ఫిర్యాదు మేరకు రాజశేఖర్‌పై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థుల మధ్య గొడవ.. కత్తితో దాడి

నగర శివారులోని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్, నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థుల మధ్య జరిగిన వివాదం... చివరకు బయట వ్యక్తులు దాడి చేసుకునే పరిస్థితి నెలకొంది. ఇటుకలపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు అనంతలక్ష్మి కళాశాలలో రెండురోజుల క్రితం బీటెక్ నాలుగో సంవత్సవరం చదువుతున్న సిద్దార్థ, సెకండియర్ చదువుతున్న ఉదయ్, ప్రభాస్ గొడవపడ్డారు. ప్రభాస్ అది మనసులో పెట్టుకున్నాడు. గురువారం సిద్దార్థ తన స్నేహితుడు సతీష్ బర్త్‌డే కావడంతో కళాశాల వెనుక కేక్ కట్ చేసే కార్యక్రమం పెట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ప్రభాస్ కందుకూరుకు చెందిన పలువురిని తీసుకెళ్లి గొడవకు దిగారు. ఈ క్రమంలో దీపు అనే వ్యక్తి సతీష్‌పై కత్తితో దాడి చేశాడు. దీంతో అతనికి గాయాలయ్యాయి. ఘటనపై ప్రభాస్, దీపు, మల్లికార్జున, కార్తీక్, రామలింగమయ్యలపై ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళపై వేటకొడవలితో దాడి

అనంతపురం నగరం పాతూరులోని చెన్నకేశవస్వామి ఆలయం ఎదుట ఓ మహిళపై వేటకొడవలితో దాడి చేశారు. తీవ్ర రక్తగాయాలైన ఆమెను చికిత్స నిమిత్తం పోలీసులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నార్పల మండలం బొందలవాడకు చెందిన హేమలత భర్త నాగార్జున కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన బాల ఓబుళేసు సమీపంలోని 15 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని దానిమ్మతోట సాగు చేసేవాడు. అతను భార్యకు దూరంగా ఉన్నాడు. బాల ఓబుళేసు, హేమలతల మధ్య వివాహేతర సంబంధం నెలకొంది. గత కొంతకాలంగా హేమలత మరికొందరితో సన్నిహితంగా ఉంటోందనే అనుమానాన్ని బాల ఓబుళేసు పెంచుకున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి హేమలతకు తెలియకుండా బాల ఓబుళేసు వెంబడించాడు. రాత్రి చెన్నకేశవస్వామి ఆలయం సమీపంలో వేటకొడవలితో మొహంపై దాడి చేశాడు. ఆమె నేలపై పడిపోవడంతో కొడవలి అక్కడే పడేసి పరారాయ్యడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

అప్పుల ఒత్తిడితో ఆత్మహత్య

అనంతపురం రూరల్ మండలం రాజీవ్‌కాలనీకి రామయ్యకాలనీకి చెందిన మహమ్మద్ రఫీ(33) అనే వవ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుంటూరు సెల్ఫ్‌ల పని చేసే రఫీ కొంతకాలం క్రితం బ్యాంకులో అప్పు తీసుకున్నాడు. కొంతకాలంగా పనులు లేక అప్పుల ఒత్తిళ్లు అధికమయ్యాయి. ఈ క్రమంలో గురువారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. రఫీకి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో వ్యవసాయ కూలీ మృతి

గార్లదిన్నె, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం గ్రామంలో గుండెపోటుతో యేసోబు(50) అనే వ్యవసాయ కూలీ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు యేసోబు, సుజాత దంపతులు కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవారు. ప్రతిరోజులాగే యోసోబు గ్రామంలో ఓ రైతు తోటలో చీనీ పండ్లు కోస్తుండగా అందులో బాగోలేని వాటని ఏరేందుకు వెళ్లాడు. పనిచేస్తుండగా ఒక్కసారిగా ఆయన కుప్పకూలిపోయాడు. గమనించిన రైతులు, కూలీలు అతనిని చికిత్స నిమిత్తం పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

టీడీపీ కార్యకర్త..

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రాజగోపాల్ గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం అర్ధరాత్రి అతనికి గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

దివ్యాంగుల చట్టాలపై అవగాహన అవసరం

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల చట్టాలపై అవగాహన అవసరమని ఇటుకలపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్‌లో దివ్యాంగుల హక్కుల చట్టం రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబులిటీస్ ఆర్‌పీడబ్ల్యూడీ-2016 తెలుగు అనువాద పుస్తకాన్ని ఎస్ఐ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ చట్టానికి పార్లమెంట్ ఆమోదం తెలిపిందన్నారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమతి ఉమ్మడిజిల్లాల కోఆర్డినేటర్ మాట్లాడుతూ సెక్షన్ 91(ఏ) ప్రకారం దివ్యాంగ వ్యక్తిని ఎవరైనా కించపరిచే ఉద్దేశంతో ఏస్థలంలోనైనా బహిరంగానైనా అవమానించినా, భయపెట్టినా, దాడిచేసినా వారికి ఆరు నెలల నుంచి ఐదేళ్ల వరకు జైలు శిక్ష తోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తారన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు షఫీ, జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, కార్యదర్శి రసూల్, కాలాప రెడ్డి, ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



పుస్తకాన్ని విడుదల చేస్తున్న ఎస్ఐ, దివ్యాంగులు



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ఐటీఐకి టెక్నాలజీ జోడింపు: ఎంపీ

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పరిశ్రామిక అవసరాలను తీర్చేలా ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఐటీఐ)కు టెక్నాలజీని జోడిస్తున్నట్లు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలను ఎంపీ సందర్శించారు. ల్యాబ్‌లు, మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. స్థానిక పరిశ్రమల్లో ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించి భరోసానిస్తున్నట్లు తెలిపారు. స్వయం ఉపాధి పొందేలా రుణాలను మంజూరుచేసి ప్రోత్సహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి, ప్రిన్సిపాల్ రామమూర్తి, ట్రైనర్లు గాయత్రి, మురళీధర్, రంజిత్ పాల్గొన్నారు,

బాల్య వివాహాలు నేరం

గార్లదిన్నె, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయాధికారి శివప్రసాద్ యాదవ్ అన్నారు. మండలంలోని కెకె తండాలో న్యాయ సేవా సదస్సు నిర్వహించారు. న్యాయాధికారి మాట్లాడుతూ... బాలికలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేస్తే కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. బాల కార్మికులు ఉండరాదన్నారు. ప్రభుత్వ చట్టాలు, ఉచిత న్యాయం ఎలా పొందాలి, ప్రభుత్వ పథకాలతో ఎలా లబ్ధిపొందాలని వివరించారు. మండల విద్యాశాఖ అధికారి తారా చంద్రనాయక్, పీఆర్‌జేఈ శ్రీనివాసరావు, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాశంకరమ్మ, వైద్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆ ముగ్గురిలో కలకలం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- ఉన్నతాధికారికి పొలిటికల్ ఎర..?



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగంలో అవినీతిపై 'ముగ్గురూ ముగ్గురే' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' గురువారం ప్రచురించిన కథనం కలకలం రేపింది. దీన్నుంచి గట్టెక్కేందుకు కార్పొరేషన్ ఉన్నతాధికారికి టౌన్‌ప్లానింగ్‌లోని ఆ అధికారులు గాలం వేస్తున్నట్లు సమాచారం. ఇద్దరు మేడమ్‌లకు రాజకీయ నేతలతో ఆర్థిక సంబంధాలున్నాయి. పాలకవర్గంలో ఉన్న వైసీపీ కీలక నేతలు, అధికారంలో ఉన్న టీడీపీ నేతల ద్వారా ఉన్నతాధికారిని దారికి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. భారీగా వసూళ్లు ఉన్నందున, అవినీతి రొంపిలోకి ఉన్నతాధికారిని దింపి, తమపై చర్యలు లేకుండా చూసుకోవాలని వారు పావులు కదుపుతున్నట్లు తెలిసింది.

నిగ్గు తేల్చండి: సీపీఐ

భవనాల అనుమతులు, అక్రమ కట్టడాల అవినీతిపై నిగ్గు తేల్చాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి ఆయన కమిషనర్ బాలస్వామికి గురువారం వినతిపత్రం అందజేశారు. 14 శాతం బెటర్‌మెంట్ చార్జెస్ చెల్లించకుండా కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. ఒక సెంటు స్థలంలో ఇల్లు నిర్మిస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు డబ్బు వసూలు చేస్తున్నారని అన్నారు. నగరపాలక సంస్థ స్థలాలను కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరారు. సెంట్రల్‌పార్కు స్థలం కబ్జాకు గురవుతున్నా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వివరించారు. వైసీపీ నాయకుల కట్టడాలపై చర్యలు లేవని అన్నారు. ఆయన వెంట సీపీఐ నగర సహాయ కార్యదర్శులు రమణ, అల్లీపీరా, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్‌కుమార్, నారాయణస్వామి, ప్రసాద్, జయలక్ష్మి, నాగప్ప, సుందర్‌రాజు, శ్రీనివాసులు, ఖాజా హుస్సేన్, చాంద్‌బాషా తదితరులు ఉన్నారు.

అర్చకులకు సత్కారాలు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): త్రిమూర్తి శివ 89వ జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అర్చక సత్కార కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం అనంతపురం నగర శివారులో గుత్తిరోడ్డులోని ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ ప్రాంతాలనుంచి హాజరైన దాదాపు 70 మంది అర్చకులు హాజరయ్యారు. వీరందరికీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అనంతపురం ప్రతినిధి శారద అధ్యక్షతన రాజస్థాన్ మౌంట్ అబుకు చెందిన రాజేశ్వర్, పుట్టపర్తికి చెందిన కల్పన చేతులమీదుగా జ్ఞాపికలు బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు ఆంజనేయులు, చిన్మయా మిషన్ ప్రతినిధి స్వామి ఆత్మవిదానంద సరస్వతి, అన్నామలై స్వామీజి, హరికృష్ణ, ఈశ్వరయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయంతో నాటుసారా నిర్మూలనకు చర్యలు

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నవోదయం కార్యక్రమంతో నాటు సారా నిర్మూలనకు చర్యలు చేపట్టనున్నట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య అన్నారు. గురువారం స్థానిక ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో నవోదయం నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం నవోదయం పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నవోదయంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించి నాటుసారా మూలంగా కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, సత్యసాయి జిల్లా సూపరింటెండెంట్ గోవిందనాయక్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, ఏఈఎస్ నరసింహులు, ఎక్సైజ్ సీఐలు పాల్గొన్నారు.

సీపీఐని బలోపేతం చేద్దాం

శింగనమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామల్లో సీపీఐని బలోపేతం చేద్దామని ఆ పార్టీ కార్యవర్గ సభ్యుడు డి.చిన్నప్పయాదవ్ అన్నారు. గురువారం మండలంలోని నాగుల గుడ్డంలో పార్టీ సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రామలక్ష్మి, సహాయ కార్యదర్శిగా మల్లక్కతోపాటు 11 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మధుయాదవ్, మునిస్వామి, నేసే మధు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్ తనిఖీ

కనగానపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు బుధవారం అస్వస్థతకుగురై ఆస్పత్రిలో చేరిన విషయం తెలిసిందే. దీనిపై ధర్మవరం ఆర్డీఓ మహేష్, డీఈఓ కిష్టప్ప, సమగ్రశిక్ష ప్రాజెక్ట్ అధికారి దేవరాజ్, ఏడీఈ రామక్రిష్ణ, ఈఈ సంపూర్ణ తదితర అధికారులు గురువారం మోడల్‌స్కూల్, హాస్టల్‌ను తనిఖీ చేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం హాస్టల్‌లోని వసతులు, భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థునులకు వండిన భోజనాలు నాణ్యతగా ఉన్నాయని, తాగునీరు కలుషితమవడంతో పిల్లలు అనారోగ్యానికి గురయ్యాయరని వారు నిర్ధారించారు. విద్యార్థులు అనారోగ్యానికి గురి కావడంపై వైఎస్సార్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘంనాయకులు పురుషోత్తం, నాగార్జున, అమరనాథరెడ్డి, పోతలయ్య, బండి శివ, కదిరప్ప హాస్టల్ వద్ద ఆందోళన చేశారు. బాధ్యులపై తీసుకోవాలని వారు డీఈఓకు వినతపత్రం అందించారు.

ముందే ఒంటిపూట బడి ప్రకటించాలి

అనంతపురం విద్య, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండల తీవ్రత దృష్ట్యా ముందే ఒంటిపూట బడులు ప్రకటించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఇతర నాయకులు గురువారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిశారు. వారు మాట్లాడుతూ ఫిబ్రవరి నుంచే ఎండలు తీవ్రం అవుతున్నాయన్నారు. ఎండల దృష్ట్యా ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లకు ఒంటిపూట బడులు నిర్వహించాలన్నారు. అనంతరం డీఈఓకు వినతిపత్రం అందించారు. నగర అధ్యక్షులు మంజునాథ్, కార్యదర్శి ఉమామహేష్, పవన్, సునీల్, వంశీ పాల్గొన్నారు.

రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలి

● డీలర్లకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచన

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులను లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు డీలర్లకు సూచించారు. అవినీతి, అక్రమాలకు తావులేకుండా చూడాలని చెప్పారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద గురువారం ఆయన నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏ రేషన్ దుకాణానికి అయినా బియ్యం తక్కువగా వచ్చిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. అలా కాకుండా బియ్యం తక్కువగా వచ్చాయని ప్రజలకు తగ్గించి వేయకూడదని స్పష్టం చేశారు. గ్రామాల్లో రేషన్ డీలర్ల పాత్ర ప్రత్యేకమైందన్నారు. ఎండీయూ వాహనదారుడు వీలున్నప్పుడు వచ్చి వేలిముద్ర వేస్తానంటే కుదరదని, ప్రతి నెలా ఒకటో తేదీ నుంచే ప్రతి రేషన్‌షాపు వద్ద రేషన్ పంపిణీ మొదలవ్వాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని చెప్పారు. లబ్ధిదారులకు ఖచ్చితంగా బియ్యం పంపిణీ చేసి ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో, తహసీల్దార్, టీడీపీ మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీటీపీ కాలువ పనులను పూర్తి చేస్తాం

బీటీపీ కాలువ పనులను పూర్తి చేసి ప్రజలకు సాగు, తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే అమిలినేని పేర్కొన్నారు. ప్రజావేదికలో ఆయన హెచ్ఎన్ఎస్ఎస్, రెవెన్యూ అధికారులతో పాటు మెకానికల్ పనులు చేసే కంపెనీ, కాలువ పనులు చేసే కంపెనీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. బీటీపీ కాలువ, కుందుర్పి బ్రాంచ్ కెనాల్, కామన్ కాలువకు సంబంధించి మెకానికల్ పనులు, ఇంకా సేకరించాల్సిన భూమి, రైతులకు పరిహారం ఇచ్చిన భూముల్లో కాలువ తవ్వకం పనులు త్వరలోనే పూర్తి చేయనున్నట్లు చెప్పారు. పంపుహౌస్‌లకు సంబంధించి భూ సేకరణ, వాటి డిజైన్లు ఇప్పటికే చాలా వరకు ఆమోదించబడ్డాయని, వాటి పనులు కూడా ప్రారంభిస్తామని అన్నారు. జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఈ ప్రాజెక్టు పురోగతి సాధించేందుకు చాలా కృషి చేశారని, అందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. టీడీపీ నాయకులు అవినాష్ తదితరులు పాల్గొన్నారు.


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

సంక్షిప్త వార్తలు

పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ

ఉరవకొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం చాబాల గ్రామంలో పైపులైన్ నిర్మాణానికి గురువారం సర్పంచ్ జగదీష్, మాజీ సర్పంచ్ ఎర్రిస్వామి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జడ్పీ నిధులు రూ. 3లక్షల వ్యయంతో మోటారు ఏర్పాటు చేసి ఓహెచ్ఎస్ ట్యాంకు వరకూ పైపులైన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వేసవిలో నీటి ఎద్దడి కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

183 మందికి ఇంటర్వ్యూలు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న 183 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ కొండన్న తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం బ్యాంకు అధికారులు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు.

దరఖాస్తుల పరిశీలన

ఉరవకొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కార్పొరేషన్ రుణాల మంజూరుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం రెండోరోజు కొనసాగింది. ఎంపీడీవో రవికుమార్ పర్యవేక్షణలో ఈవోఆర్డీ సతీష్‌కుమార్, ఏవో శివశంకర్ పరిశీలించారు. మండల వ్యాప్తంగా 82యూనిట్లకు 825మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఎంపీడీఓ కార్యాలయం దరఖాస్తుదారులతో కిటకిలాడింది.

నేడు ఇంటర్వ్యూలు

విడపనకల్లు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ, ఈబీసీ, ఓసీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షకీలా బేగం గురువారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఉదయమే ఎంపీడీఓ కార్యాలయం చేరుకోవాలని సూచించారు.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

యల్లనూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నపూసపల్లి గ్రామంలో రైతు మహేశ్వర్‌రెడ్డి గురువారం ఉదయం వ్యవసాయ పొలంలో పాముకాటుకు గురయ్యాడు. పొలంలో గడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు పాముపై కాలు వేయడంతో అది కాటు వేసింది. దీంతో అస్వస్థతకు గురైన అతడిని వెంటనే కుటుంబ సభ్యులు యల్లనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమచికిత్స అందించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కర్ణాటక మద్యం ధ్వంసం

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మసముద్రం, కుందుర్పి, శెట్టూరు, కంబదూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో 126 కేసులలో పట్టుబడిన కర్ణాటక మద్యంను, నాటు సారాను గురువారం పోలీసులు ధ్వంసం చేశారు. అనంతపురం ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రేవతి సుబ్రహ్మణ్యం సమక్షంలో కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వర, కుందుర్పి ఎస్ఐ నాగేష్, కంబదూరు ఎస్ఐ ప్రవీణ్, బ్రహ్మసముద్రం ఎస్ఐ నరేంద్ర కుమార్, సిబ్బంది సమక్షంలో ధ్వంసం చేశారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

● కాలం చెల్లిన కూల్‌డ్రింక్‌ల విక్రయం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో కాలం చెల్లిన కూల్‌డ్రింక్‌లు విక్రయాలు జరుపుతుండడం దూమారం రేపింది. ఉద్దేహాళ్ గ్రామంలోని ఓ కూల్‌డ్రింక్ షాపులో విక్రయ దారుడు గత గురువారం ఓ కూల్‌డ్రింక్ కొనుగోలు చేశాడు. దాన్ని కొంత వరకు తాగగా.. తేడాగా అనిపించింది. తీరా బాటిల్‌ను పరిశీలించి కాలం చెల్లినట్లు గమనించి ఖంగు తిన్నాడు. గతేడాది డిసెంబరు 2వ తేదీకే ఆ కూల్‌డ్రింగ్ కాలం చెల్లింది. అది అనోట..ఈనోట... పడి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. కర్ణాటక నుంచి కొందరు ఇలాంటి ఔట్ డేటెడ్ కూల్‌డ్రింక్‌లను మండలంలోని కూల్‌డ్రింక్ దుకాణాలకు, కిరాణా షాపులకు చౌక బేరాలకు వేస్తున్నారు. ప్రస్తుతం వేసవి సమీస్తుండడంతో ఎక్కువగా కొనుగోలు చేస్తారని, కాలం చెల్లినా.. గ్రామీణ ప్రాంతాల్లో వినియోగిస్తారని ఈ దందాకు తెరలేపి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. కాలంచెల్లిన కూల్‌డ్రింక్‌లను కిరాణా దుకాణాలు, కూల్‌డ్రింక్ దుకాణాల్లో వేసి డీలర్ షిప్ యాజమాన్యం సొమ్ము చేసుకుంటోందని, ఈ తంతు సంబంధిత అధికారులకు కన్పించడం లేదా అని ప్రజలు వాపోతున్నారు. కాలంచెల్లిన కూల్‌డ్రింక్‌లు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటివి మళ్లీ జరగకుండా చూడాలని వారు కోరుతున్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

బెళుగుప్ప, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేజీబీవీలో పదో తరగతి విద్యార్థినులు 41 మందికి ఎస్ఐ శివ గురువారం సొంత ఖర్చులతో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

శెట్టూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలేడులో గల చైతన్య ఫర్టిలైజర్స్ దుకాణాన్ని కళ్యాణదుర్గం ఏడీఏ యల్లప్ప గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బడుగులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

పామిడి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ప్రజలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ సభ్యుడు రాజమహేంద్రనాథ్ సూచించారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముందుగా అక్కడి బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి సారించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్, స్టాండ్ ఆఫ్ ఇండియా, వివిధ పరిశ్రమల నుంచి లబ్ధి చేకూరుతోందని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొట్టాల సూర్యనారాయణ, నక్కల రామాంజనేయులు, జై భీమ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

యాడికి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రెటరీ రమ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డుల ను పరిశీలించారు. గ్రంథాలయాధికారి మధుసూదన్ పాల్గొన్నారు.

ఇంటిపట్టాల పంపిణీ


ఇంటిపట్టా అందజేస్తున్న క్లస్టర్ ఇన్‌చార్జి

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ముచ్చుకోట గ్రామంలో అర్హులైన 17మందికి ఇంటి పట్టాలను మండల క్లస్టర్ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నిలబెట్టుకోవడానికి కృషి చేస్తోందని అన్నారు. అందులో భాగంగానే ఇంటి పట్టాలు పంపిణీ చేస్తోందని చెప్పారు. ఆర్ఐ ప్రసన్నకుమార్, వీఆర్వోలు, టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


లోకేశ్ నాయక్ (ఫైల్)

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధరాంపురం తండాకి చెందిన లోకేశ్ నాయక్(29) ఉరివేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. లోకేశ్‌నాయక్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. పదేళ్ల క్రితం జ్యోతిబాయితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. కొన్ని రోజులుగా లోకేశ్ అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. తన అనారోగ్యం కుటుంబానికి భారంగా మారుతోందని ఆవేదనకు లోనయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నాడు. కాసేపటికి గమనించిన భార్య జ్యోతిబాయి కేకలు వే యడంతో చుట్టుపక్కలవారు వచ్చి, లోకేశ్ నాయక్‌ను కిందికి దించి, బళ్లారి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జ్యోతిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు.

మట్కా బీటర్ల అరెస్టు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కణేకల్లు, డీ.హీరేహాళ్ మండలాలలో మట్కాస్థావరాలపై దాడులు చేసి తొమ్మిది మంది మట్కాబీటర్లను అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ వెంకటరమణ పేర్కొన్నారు. పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన ఆ వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నాలుగు మండలాల ఎస్ఐలు మట్కాస్థావరాలపై దాడులు చేశారన్నారు. బొమ్మనహాళ్ మండలానికి చెందిన ఒకరిని అదుపులోకి తీసుకుని రూ. 50,500 నగదును స్వాధీనం చేసుకున్నారని, కణేకల్లు మండలంలో అంబాపురం టోల్ వద్ద ఒకరిని అరెస్టు చేసి రూ.41,980 నగదు స్వాధీనం చేసుకున్నారని, గుమ్మఘట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో పూలకుంట గ్రామానికి చెందిన ఇద్దరిని అరెస్టు చేసి రూ.25వేల నగదును స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. అలాగే డీ.హీరేహాళ్ మండలంలో నాగలాపురంలో ఐదుగురిని అరెస్టు చేశారని అన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు చెప్పారు. ఎస్ఐలు నబీరసూల్, ఈశ్వరయ్య, నాగమధు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఎండీయూ వాహనాలు

● కార్యాలయాలు, ఆపరేటర్ల ఇళ్ల వద్ద ఓ మూలన దర్శనం

శెట్టూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ కోసం గత వైసీపీ ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో మండలానికి తొమ్మిది వాహనాలను ఏర్పాటు చేసింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక ఆ వాహనాలను కొనసాగించడం లేదు. డీలర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి చౌకధాన్యం డిపోల్లో లబ్ధిదారులకు సరుకులు అందజేస్తోంది. ఎండీయూ ఆపరేటర్లు ప్రస్తుతం డీలర్ల వద్దకు వేలిముద్ర కోసం వస్తున్నారు. కాగా ఆ వాహనాలు మాత్రం ఎందుకూ పనిరాకుండా ఉన్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. వాహనాలు ఎండీవో ఆపరేటర్ల ఇళ్ల వద్ద, పలు కార్యాలయాల వద్ద ఓ మూలన దర్శనమిస్తున్నాయి.


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరుపయోగంగా ఉన్న ఎండీయూ వాహనాలు

చెత్తతో సంపద తయారీ కేంద్రం పరిశీలన

పామిడి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలూరు గ్రామంలోగల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లాప్ మిత్రలు చెత్త బండికి మైక్ అమర్చుకొని స్వచ్ఛతపై ప్రజలకు ప్రతి రోజూ అవగాహన కల్పించాలని తెలిపారు. సంపద కేంద్రాలలో వానపాముల ద్వారా వర్మీ కంపోస్టు తయారు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంత చెత్తను సేకరిస్తే అంత సంపదను సృష్టించవచ్చని పేర్కొన్నారు. ఈఓఆర్డీ రాజేంద్ర కృష్ణకుమార్, పంచాయతీ కార్యదర్శి షామీర్, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా


గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కేవలం మహిళా అభ్యర్థులకు మాత్రమే జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అల్ డెస్కాన్ టెక్నాలజిస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ పూర్తి చేసి 19 నుంచి 35 ఏళ్ల లోపు వయసుగల మహిళా అభ్యర్థులు మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఇంటర్వ్యూలకు బయోడెటాతోపాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, రెండు పాస్‌ఫొటోలు తీసుకొని ఉదయం 10 గంటలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

టెక్నికల్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలి

గుత్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అకాడమిక్స్‌తో పాటు టెక్నికల్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని పట్టణ సమీపంలోని గేట్స్ కళాశాల కరెస్పాండెంట్ వీకే పద్మావతమ్మ సూచించారు. పాలిటెక్నిక్ అకాడమిక్ పరీక్షలలో 75నుంచి 100శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం ఆమె వారి తల్లిదండ్రుల సమక్షంలో ఆనర్స్ అవార్డులు, ప్రతిభ పురస్కారాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు కృషి పట్టుదలతో ఉన్నత స్థాయిలో రాణించాలని తెలిపారు. ప్రిన్సిపాల్ నరసింహులు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కణేకల్లు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో అక్రమంగా నిల్వ ఉన్న 270 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని గురువారం పట్టుకున్నట్లు విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక రామ్‌నగర్‌లో బసవరాజు అనే వ్యక్తి తన ఇంటి సమీపంలో ఒక వ్యాన్ బియ్యం బస్తాలను ఉంచి కర్ణాటకలోని పావగడకు తరలించేందుకు సిద్ధమయ్యాడనీ, తమకు సమాచారం అందడంతో వెంటనే సిబ్బందితో కలిసి దాడులు చేసి బియ్యం బస్తాలను, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. బసవరాజుతోపాటు వ్యాన్ డ్రైవర్‌పై కూడా కేసును నమోదు చేసినట్లు తెలిపారు. డీసీటీఓ సురేష్‌కుమార్, సీఎస్‌డీటీ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


పట్టుకున్న బియ్యంతో విజిలెన్స్ అధికారులు

ఘనంగా ఆవుల దేవర

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామంలో యల్లమ్మదేవి, ఈరన్నస్వాముల మహోత్సవాల సందర్భంగా గురువారం ఆవుల దేవరను ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో తొలుత యల్లమ్మదేవి పూజారి పట్టాభిషేకం సందర్భంగా జలధి నిర్వహించారు. అనంతరం ఊరి చివరన సిద్ధప్పస్వామి ఆలయం వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించి ఆవుల గూడును ఏర్పాటు చేసి స్వామిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. అనంతరం మేకలను, గొర్రెలను, ఆవులను ఆవులగూడు చుట్టూ ప్రదక్షిణ చేయించి గ్రామంలో స్వామివార్ల ఊరేగింపును భక్తుల మధ్య నిర్వహించారు.


స్వామివార్లను ఊరేగిస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పామిడి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గజరాంపల్లి వద్ద గల 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం నుంచి ఆటో రంగు డబ్బాలతో గుత్తికి బయలుదేరింది. అయితే గజరాంపల్లి వద్దకు రాగానే వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో ఆటో బోల్తా పడి రంగు డబ్బాలు రోడ్డుపై పడి రంగలన్నీ నేలపాలయ్యాయి. డ్రైవర్ రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని పామిడి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యాడికిలో మరొకరికి..

యాడికి: మండలకేంద్రంలోని ప్రైవేటు కళాశాల సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన యువకుడు మణికుమార్ ద్విచక్రవాహనంపై కేఫ్ వద్దకు బయలుదేరారు. అయితే ప్రైవేటు కాలేజీ వద్ద నూనె డబ్బాలతో వస్తున్న రిక్షాను ప్రమాదవశాత్తూ ఢీకొన్నాడు. ప్రమాదంలో మణికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

కిష్టిపాడు వద్ద ఇంకొకరికి..

పెద్దవడుగూరు: మండలంలోని కిష్టిపాడు గ్రామసమీపంలోని ప్రధాన రహదారిలో బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో కదరగుట్టపల్లికి చెందిన రంగస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లో నివాసమున్న రంగస్వామి సమీప బంధువుల వివాహం కోసం స్వగ్రామానికి వచ్చాడు. అయితే వ్యక్తిగత పనినిమిత్తం బైక్‌పై గుత్తి నుంచి రాయలచెరువుకు వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొంది. స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తి ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ వైరు పడి..

కణేకల్లు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం విద్యుత్ స్తంభాన్ని ఐషర్ వాహనం ఢీ కొనడంతో హైటెన్షన్ వైరు తెగిపడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందిరమ్మ కాలనీలలో ఐషర్‌వాహనం సబ్‌మార్కెట్‌యార్డు వైపు వెళుతూ ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీ కొంది. దీంతో ఆ స్తంభం విరిగి పడగా.. హైటెన్షన్ వైరు సమీపంలో ఉన్న జయరాం అనే వ్యక్తిపై పడింది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని అనంతపురం ఆస్పత్రికి తరలించారు. కాగా, విద్యుత్ స్తంభం విరిగిన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు.

లారీ ఢీకొని రిటైర్డ్ ఉద్యోగి మృతి

గుత్తిరూరల్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి సమీపాన రహదారిపై గురువారం రాత్రి లారీ ఢీకొని రిటైర్డ్ ఉద్యోగి మస్తాన్‌వల్లి (67) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుత్తి ఆర్ఎస్‌కి చెందిన మస్తాన్‌వలి బసినేపల్లి తండాకు వెళ్లి తిరిగి నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా గ్రామ శివారులో లారీ ఢీకొట్టింది. మస్తాన్‌వలి అక్కడికక్కడే మృతి చెందాడు. గుత్తి ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ నాయకుడి గడ్డివాముకు నిప్పు

విడపనకల్లు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి గ్రామంలో టీడీపీ నాయకుడు లస్కర్ వెంకటేశులుకి చెందిన గడ్డి వామికి గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. 20 ఎకరాల్లోని జొన్న సొప్ప, 15ఎకరాల్లోని వరి గడ్డిని, మరో 10 ఎకరాల్లో గడ్డిని కొని తన పశువుల కోసం ఊరికి దగ్గర్లోని పొలంలో వామి వేశానని, అయితే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టి అంతా బూడిద చేశారని బాధితుడు వాపోయాడు. దాదాపుగా రూ. 8లక్షల మేర నష్టం జరిగినట్లు తెలిపాడు. ఉరవకొండ అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలు వ్యాప్తి చెందకుండా అదుపు చేశారు. గ్రామస్థులు కూడా మంటలు ఆర్పేందుకు తోడ్పాటు అందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

బెళుగుప్ప, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన ఇద్దరు యువకులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ బాల నరసింహులు, కానిస్టేబుళ్లు జనార్దన్, వెంకటేష్ నాయక్ గస్తీ నిర్వహిస్తుండగా స్థానికయువకుడు నిఖిల్ మద్యం సేవించి వారి పట్ల ఇష్టారాజ్యంగా వ్యవహరించా డు. నిఖిల్‌కు మద్దతుగా బండపు శివశంకర్ వచ్చి మీరెలా విధులు నిర్వహిస్తారో చూస్తానంటూ బెదిరించాడు. దీంతో హెచ్‌సీ బాలనరసింహులు ఫిర్యాదు మేరకు ఆ ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ సీజ్

యాడికి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను గురువారం సీజ్‌చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. రాయలచెరువు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను గుర్తించినట్లు తెలిపారు. వెంటనే సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం ఆ టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించామని సీఐ పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ


విఘ్నేశ్వరపూజ నిర్వహిస్తున్న అర్చకులు

తాడిపత్రి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం విఘ్నేశ్వరపూజ, శైవపుణ్యావాచనం తో అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం

గుత్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో మాఘమాసం సందర్భంగా గురువారం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రోచ్ఛారణల నడుమ కల్యాణం జరిపించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఫోర్‌లైన్ పనులను అడ్డుకున్న గ్రామస్థులు


గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

తాడిపత్రి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): అనంతపురం- కడప రహదారి ఫోర్‌లైన్ పనులను జరుగుతున్న సందర్భంలో మండలంలోని బొందలదిన్నె గ్రామం వద్ద ఒకసైడు రోడ్డు పనులు జరుగుతుండగా మరోసైడు పనులు చేస్తున్న వారిని గ్రామస్థులు అడ్డుకున్నారు. ఫోర్‌లైన్‌లో భాగంగా కొన్ని ఇళ్లు ఎన్‌క్రోచ్‌మెంట్‌లో పోగా వాటిని తీయకుండా గ్రామస్థులు అడ్డుకోవడం తీవ్రదుమారం రేపింది. ఈ విషయంపై రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్ఐ ధరణీబాబు సిబ్బందితో హుటాహుటినా అక్కడకు వెళ్లి మాట్లాడారు. అయినా వారు వినకపోవడంతో తహసీల్దార్ రజాక్‌వలి ఘటనా స్థలానికి చేరుకొని స్థలం, ఇళ్లు ఇవన్నీ ఎన్‌క్రోచ్‌మెంట్‌లో పోయాయని, వీటికి డబ్బులు కూడా ప్రభుత్వం చెల్లించిందని, ఇప్పుడు మీరు అడ్డుకోవడం భావ్యం కాదని తెలిపారు. మొత్తం ఒకేసారి అన్ని ఇళ్లు పూర్తిగా తొలగించేవిధంగా చూడాలని కొందరు గ్రామస్థులు కోరారు. గ్రామస్థుల్లో ఒకరిలో ఒకరు సరిగా లేకపోవడంతో ఈ సమస్య వచ్చిందని రెవెన్యూ, పోలీసు అధికారులు తెలిపారు. ఎన్‌క్రోచ్‌మెంట్‌లో ఎవరూ అడ్డుపడకుండా ఉండేందుకు పోలీసులు అన్నివిధాలుగా చర్యలు తీసుకొని వాటిని తొలగించడం జరిగింది.

కెరీర్‌పై అవగాహన

తాడిపత్రి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆదర్శపాఠశాల, పెద్దపొలమడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం అర్జాస్ స్టీల్ పరిశ్రమ వారు కెరీర్‌పై అవగాహన కల్పించారు. డిజిటల్ రూపంలో కెరీర్ గైడెన్స్ ఇచ్చారు. ఈ సందర్భంగా 10వ తరగతి పూర్తయ్యాక ఉన్నత విద్యావకాశాలు ఎలా సాధించాలి, పోటీ పరీక్షల్లో ఎలా రాణించాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అర్జాస్ స్టీల్ సీఎస్ఆర్ హెడ్ నరేంద్ర, హెచ్ఎం లావణ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం

గుత్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన, కమిషనర్ జబ్బర్ మియా సమక్షంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఇందులో పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ.. ఈ సమావేశాల్లో తమ వార్డులలో నెలకొన్న సమస్యలను పలుమార్లు ప్రస్తావించామని, అయితే ఇంతవరకు పరిష్కారం కాలేదని వాపోయారు. సమస్యలను పరిష్కరించనప్పుడు ఈ సమావేశాలు ఎందుకని అధికారులపై మండిపడ్డారు. తర్వాత వార్డుల్లోని వివిధ సమస్యల్ని వైస్‌చైర్‌పర్సన్ వరలక్ష్మి, కౌన్సిలర్లు నజీర్, వరద, శివ తదితరులు అధికారులకు విన్నవించారు. మున్సిపల్ మేనేజరు రాంబాబు, టౌన్‌ప్లానింగ్ అధికారి మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయదుర్గం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణానికి విద్యుత్ సరఫ రా అయ్యే ఉడేగోళం 132 కేవీ సబ్ స్టేషన్‌లో కొత్తగా ఏపీ స్విచ్‌లు ఏర్పాటు చేసే ప్రక్రియలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బాలచంద్ర గురువారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు చదం ఫీడర్ పరిధిలో గల అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అలాగే మధ్యాహ్నం 1:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పల్లేపల్లి ఫీడర్‌లో అన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కందుల కొనుగోలు కేంద్రం తనిఖీ

గుత్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్కెట్ యార్డులో గల కందుల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కందుల కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం అక్కడి రైతులతో చర్చించి సమస్యలనడిగి తెలుసుకున్నారు. కందులు అమ్మి 15రోజులైనా ఇంతవరకు తమ ఖాతాల్లో డబ్బులు జమకాలేదని రైతులు ఆమె దృష్టికి తెచ్చారు. దీంతో మార్కెఫెడ్ సిబ్బందితో ఆమె చర్చించి వెంటనే రైతుల ఖాతాలో డబ్బులు జమఅయ్యేలా చూడాలని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరాముడు, సాంకేతిక వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.